

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 02 హైదరాబాద్ 2015 జూన్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మెహెరస్థాన్ ధర్మశాల 10వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 10వ వార్షికోత్సవం 2015 ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్లు, మెహెరాబాద్ నుండి పలువురు బాబా ట్రస్టు సభ్యులు హాజరువుతున్నారని బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ వై. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

**గోదావరి పుష్కరాలు**

**గోదావరి పుష్కరాలు** సందర్భంగా 2015 జూలై 12 –25 దాకా మెహెర్‌స్థాన్ ధర్మశాలకు విచ్చేసే బాబా ప్రేమికులకు తగిన భోజన బస ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ (99121 99978, 088132 34312) ఒక ప్రకటనలో తెలిపారు.

# చల్లపల్లి సెంటర్ స్వర్ణోత్సవాలు

చల్లపల్లి బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2015 ఆగస్టు 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నామని కార్యదర్శి శ్రీ పి.వి. రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలు త్వరలో పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా మెహెరాబాద్ నుంచి చైర్మన్, బాబా ట్రస్టు శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ జాల్ పి. దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్, తదితరులు పాల్గొంటున్నారని శ్రీ రమణారావు తెలిపారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ యస్వీ ప్రసాద రాజు, హైదరాబాద్, సహవాస్ కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆయన అన్నారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతూ, విచ్చేసే ప్రేమికులు తమ వివరాలు జూలై 15లోగా పంపవల్సిందిగా కోరుతున్నారు.

## మెహెర్‌బాబా పత్రిక



మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, 995 955 3218ని సంప్రదించగలరు.

## బాబా సందేశం

నాకెవరూ కొత్తవారు కాదు. కాబట్టి,
నాకు ఎవరినీ పరిచయం చేయాల్సిన పనిలేదు.

No one requires an introduction to Me,
for No one is a stranger to Me

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-65553218**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. మౌన వార్షికోత్సవం 2015 జూలై 10 | 6-8 |
| 3. మౌనం రెండు రకాలు | 9 |
| 4. బాటసారులు | 10 |
| 5. చట్టిబాబా | 11-17 |
| 6. మా మాటలు | 18-19 |
| 7. లార్డ్ మెహెర్ | 20-23 |
| 8. హిందీ సహవాస్ | 24-28 |
| 9. దాదాఛాంజీ | 29-37 |
| 10. ప్రార్థనలు | 38-39 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# మౌన వార్షికోత్సవం

**మెహెరాబాద్‌లో**

జూలై 10, మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరాబాద్ వెళ్ళే బాబా ప్రేమికులు తమ భోజన, బస ఏర్పాటుకై జూన్ 30లోగా ఆంధ్రా రెస్టు హౌసు కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ (99 12 199978) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు. ఈ సమయంలో వృద్ధులకు, జీవిత సభ్యులకు బస ఏర్పాటులో తగిన ప్రాధాన్యత ఇవ్వడమౌతుందని శ్రీ శ్రీనివాస్ అన్నారు.

**మెహెర్‌స్థాన్**

మెహెర్‌స్థాన్, కొవ్వూరులో కూడా జూలై 10 మౌన వార్షికోత్సవానికి విచ్చేసే బాబా ప్రేమికులకు తగిన భోజన, బస ఏర్పాట్లు ప్రత్యేకంగా చేసినట్లు, కొవ్వూరు విచ్చేసే ప్రేమికులు తమ వివరాలను జూన్ 30 లోగా కార్యదర్శి శ్రీ వై. శ్రీ వై. శ్రీనివాస్ (9912 199978) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.

అలాగే, హైదరాబాద్‌లోని జూబ్లి బాబా సెంటర్, కోఠి, మల్కాజిగిరి, మరి ఇతర తెలుగు ప్రాంతాల్లోగల అన్ని బాబా సెంటర్‌లలో మౌనవార్షికోత్సవానికై తగిన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## జలనిధి

ఆంధ్రా రెస్టు హౌసుకు అవసరమైన నీటిని ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న సంగతి బాబా ప్రేమికులందరికీ తెలుసు. తీవ్ర మంచినీటి ఎద్దడి గల ఈ ప్రాంతంలో రెస్టు హౌసులో బస చేసే ప్రేమికుల సౌకర్యార్థం ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఇందుకోసం అధిక మొత్తంలో ఖర్చు అవుతోందని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆర్థిక స్తోమత గల బాబా ప్రేమికులు నీటి కొనుగోలు నిమిత్తం ఏర్పాటు చేసిన **జలనిధికి** తగిన విరాళాలు పంపి సహకరించవల్సిందిగా శ్రీ వై. శ్రీనివాస్ (99 12 199978) కోరుతున్నారు.

## హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

సంపాదకీయం

# మౌనావతారుడు

మెహెర్‌బాబా మౌనావతారుడు.

ఆయన ప్రేమికులందరూ ప్రతి ఏటా జూలై 10వ తేదీ కోసం ఎదురు చూస్తుంటారు.

బాబా ప్రేమికులు చాలామంది ప్రతి ఏటా జూలై 9 అర్ధరాత్రి 12 గంటల నుండి జూలై 10 అర్ధరాత్రి వరకు మౌనం పాటిస్తారు.

ఆ సమయంలో బాబా నామస్మరణలో గడిపే ప్రయత్నం చేస్తారు.

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి ఆయన భౌతిక దేహం వదిలే వరకూ (1969 జనవరి 31) 44 సంవత్సరాలు కఠిన మౌనంలోనే వున్నారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజుని పురస్కరించుకుని, బాబావారి ఆదేశాల మేరకు మెహెర్‌బాబా ప్రేమికులందరూ జూలై 10న మౌనం పాటిస్తారు.

మౌనంగా మెహెర్‌బాబా ఆసేతు హిమాచలం పర్యటించారు.

ఎందరో మస్తులనే భగవదోన్మత్తులను కలిసారు.

అలాగే 13 సార్లు అమెరికా, బ్రిటన్ తదితర దేశాలను సందర్శించారు.

భగవద్వచనం, సర్వం-శూన్యం, మెహెర్‌బాబా-ప్రవచనములు వంటి గ్రంథాలలో అనేక ఆధ్యాత్మిక అంశాలను నేటి మానవాళి కోసం అందజేశారు.

మెహెర్‌బాబాకు చక్కని గొంతు వుండింది. ఆయన మాట్లాడుతుంటే ఎంతో మధురంగా వుండేది. అలాంటిది మౌనంగా ఎవ్వరితో మాట్లాడకుండా సంజ్ఞలు చేస్తుంటే, చూస్తూ వూరుకోలేక, ఒక సందర్భంలో ఆయన తల్లి బాబావారిపై గట్టిగా కోప్పడుతూ **నీ చుట్టూతా వున్న శిష్యులందర్నీ మౌనంగా వుండమని ఆదేశించ వచ్చు కదా?** నిన్ను నీవెందుకు శిక్షించుకుంటావని బాధపడితే, అమ్మా చూడు! ఈ ప్రపంచంలో వున్న యావత్తు మానవాళి మౌనం పాటించినా, నేను ఒక్కరోజు మౌనం పాటించిన దానితో సమానం కాదని బాబా స్పష్టం చేశారు. తాను చేపట్టిన ఈ మౌనం మానవాళి కళ్యాణం కోసమని బాబా సూచించారు. తాను మౌనంగా వున్నా తన ప్రేమికులందరితో నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు.

ఓ మెహెర్‌బాబా నీవెందుకు మాట్లాడవయ్యా ! అని ప్రశ్నించిన అనేక మందికి సమాధానంగా, నేనెన్నడూ మౌనంగా లేను. నేను మీ హృదయాలతో నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు. ఆ మాటలు శ్రద్ధగా ఆలకించడానికి మనం సిద్ధంగా వుండాలి. మనస్సులో అనుకున్నదే తడవుగా బాబా తగిన జవాబిస్తారు. ఆపదలో వున్నవారిని అనుక్షణం బాబా ఆదుకుంటారని బాబా భక్తుల స్వీయ అనుభవం.

**మెహెర్‌బాబా మౌనావతారుడు. ప్రేమావతారుడు.**

## మౌన వార్షికోత్సవం

# 2015 జూలై 10



మెహెర్‌బాబా ప్రేమికులందరికీ 2015 జూలై 10 చాలా పవిత్రమైన రోజు. జూలై 9 అర్థరాత్రి నుండీ తిరిగి జూలై 10 అర్థరాత్రి వరకూ బాబా ప్రేమికులందరూ బాబా నామం స్మరిస్తూ కఠిన మౌనం పాటిస్తారు. ఆ రోజున ప్రతి బాబా సెంటర్‌లో విచ్చేసే బాబా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. పావన గోదావరి నదీతీరాన వున్న మెహెర్‌స్థాన్‌లో, బాబా సమాధివున్న అహ్మద్‌నగర్ జిల్లాలోని మెహెరాబాద్‌లో కూడా మౌన వార్షికోత్సవం కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏతావాతా, కొన్నివేల మంది బాబా ప్రేమికులు జూలై 10 వ తేదీనాడు కఠిన మౌనం పాటిస్తున్నారు. ఇది మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన ఆదేశం.

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి తన భౌతిక దేహం వదిలే దాకా మౌనంలోనే వున్నారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజు నాటికి ఆయన వయస్సు 31 సంవత్సరాలు. మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25 న పూణేలో జన్మించారు.

ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఎదుటివారు సమ్మోహితులయ్యేలా మాట్లాడేవారు. స్వయంగా డోలక్ వాయిస్తూ, అద్భుతంగా ఘజల్సు గానం చేసేవారు. అనర్గళంగా ఆయన చెప్పే అనేక ఆధ్యాత్మిక విషయాలు వినడానికి ఎందరో బాబా చుట్టూతా చేరేవారు.

ఐతే, 1925వ సంవత్సరం ప్రారంభంలోనే తాను త్వరలో మౌనం ప్రారంభించనున్నానని ప్రకటించారు. బాబావారు చేసిన ఈ ప్రకటనలోని మర్మం ఆయన శిష్యులకు ఏమీ బోధపడలేదు. ఒకసారి బాబా తన మౌనం గురించి చెప్తుంటే, బాబా నీవు మౌనం పాటిస్తే, నీవు నిత్యం చెప్తున్న అనేక ధర్మ సూక్ష్మాలు మాకెవరు చెప్తారు. దయచేసి మౌనం పాటించవద్దని ఆయన శిష్యులు అనేక విధాలుగా ప్రాధేయపడ్డారు. **అందుకు జవాబిస్తూ మెహెర్‌బాబా...**

**నేను బోధించుటకు రాలేదు.**
**మేల్కొల్పుటకు వచ్చానని ప్రకటించారు.**
**I have Come not to teach - But to Awaken -**
ఇలా మొదలయిన అవతారుని మౌనం ఆయన భౌతిక శరీరం త్యాగం చేసేదాకా కొనసాగించారు. మౌనంగానే బాబా 13సార్లు విదేశీ ప్రయాణాలు చేశారు. భగవద్వచనం, సర్వం – శూన్యం, అనేక ప్రవచనాలు గ్రంథస్థం చేశారు. బాబా తన మౌనం గురించి పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ.......నేనెప్పుడూ మౌనంగా లేను.
మీ హృదయాంతరాలతో నేను నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు.
**మెహెర్‌బాబాకు రెండుసార్లు ఘోర కారు ప్రమాదాలు జరిగాయి.**
**మొదటిసారి**–అమెరికాలోని ఒక్లహోమా ప్రాంతంలో,
**రెండవసారి** మహారాష్ట్రలోని సతారా (పూణే) దగ్గర కారు ప్రమాదాలు జరిగాయి.
ఈ భయంకర ప్రమాదంలో బాబా కాలికి, తుంటికి ఫ్రాక్చర్ అయ్యింది.
బాబాకు ఆపరేషన్ చేయ్యాల్సివచ్చింది.
ఆ అపరేషన్ సమయంలో కూడా బాబా తన మౌనం విడనాడ లేదు.
అనంతమైన బాధను మౌనంగా అనుభవించిన అవతారుడిని చూసి
అటు అమెరికాలో, అలాగే మన దేశంలోని వైద్యులు ఆశ్చర్యపడ్డారు.
సాధారణ మానవులు మౌనంగా ఇంతటి బాధను భరించలేరని డాక్టర్లు పేర్కొన్నారు.
1925 నుంచి 1954 దాకా బాబా అక్షరఫలకం సహాయంతో బాబా తన మౌనం కొనసాగించారు. ఆ తర్వాత, అక్షరఫలకం కూడా వదలి, కేవలం సంజ్ఞలతో తన సందేశాలు ఇచ్చారు. బాబా మండలి సభ్యులు, మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ జెస్సావాలా బాబా మౌనం గురించి ప్రస్తావిస్తూ, మండలి సభ్యులం కూడా బాబా చేపట్టిన మౌనం ఎప్పుడు విరమిస్తారని తరచు అడుగుతుండేవారమన్నారు. అయితే, 1954లో ఒకసారి ఇలానే అడిగేసరికి, అకస్మాత్తుగా నేనిక ఈ అక్షరఫలకం కూడా వుపయోగించనన్నారు. మేమయితే, బాబా మౌనవిరమణ చేయబోతున్నారేమో అనుకున్నాం. కాని అలా జరగలేదు. ఆనాటి నుండి బాబా అక్షరఫలకం కూడా వదలిపెట్టి తన మౌనాన్ని సంజ్ఞలతో కొనసాగించారు. ఏరుచ్ ఇంకా ఏమంటారంటే,
All He would say, refering to His silence, was, what a binding it is, but it was a binding with a purpose - for our sake అని స్పష్టం చేశారు.
ఐతే, బాబా మౌనం ఎందుకు ప్రారంభించారు.
ఎప్పుడు మౌన విరమణ చేస్తారు. ఇలా బాబా మౌనంకు సంబంధించి ఎందరో 2మెహెర్‌బాబానే నేరుగా ప్రశ్నించారు.
1930 దశకంలో బాబా విదేశీ పర్యటనలో కూడా ఎందరో విదేశీయులు, పత్రికా

విలేఖర్లు తరచు తరచి తరచి బాబా మౌన విరమణ గురించి గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. వీరందరి ప్రశ్నలకు సమాధానంగా బాబా ఇలా చెప్పారని
మరో సందర్భంలో ఏరుచ్ అన్నారు.
**కోపం వచ్చినప్పుడు ఎందుకు అలా ఎదుటి వ్యక్తిపై గట్టిగా అరుస్తారు, అని బాబా మమ్మల్ని ప్రశ్నించారు. కోపం వచ్చినప్పుడు ఎదుట వున్న వ్యక్తి హృదయంలోనుంచి దూరమవుతాడు. కోపం పెరిగేకొద్దీ, ఆ వ్యక్తుల మధ్య దూరం పెరుగుతూపోతుంది. ప్రేమ కరవౌతుంది.అందుకే ఒకరిపై మరొకరు గట్టిగా వాదులాడుకుంటారన్నారు బాబా. ఆదే మరో ఇద్దరు ప్రేమికులయితే ఎలా మాట్లాడుకుంటారు. మృదువుగా, సున్నితంగా వారి సంభాషణ వుంటుంది కదా అని బాబా అన్నారు. వారిద్దరి మధ్య ప్రేమ పెరిగేకొద్దీ వారి మాటల్లో మృదుత్వం పెరుగుతుంది. ప్రేమ మరీ పెరిగితే వారి మధ్య మాటల అవసరమే తగ్గుతుంది అని బాబా వివరించారని బాబా మౌన విశిష్టతపై ఏరుచ్ క్లుప్తంగా ముగించారు.**
బాబా తన ప్రేమికులకు వారి శ్వాసకన్నా దగ్గరగా వుంటానన్నారు. మీ హృదయాలతో నేరుగా నిరంతరం మాట్లాడుతూనే వుంటానని, తానెప్పుడూ మౌనంగా లేనని స్పష్టం చేశారు.

## మీరు మౌనంలో వుండగా ...

మీ మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తూ వుంటుంది.
ఎన్నో ఆలోచనలు వస్తాయి. అలాంటి ఆలోచనలను అడ్డుకోవద్దు. అయ్యో... అని బాధ పడొద్దు. ఆలోచనలను ఫ్రీగా రానీయండి. అలాగే పోనీయండి. నా నామం తలుచుకోవడం మాత్రం మరిచి పోవద్దు అని బాబా అన్నారు.అలాగే, మౌనంగా వున్న సమయంలో పొరపాటున మాట్లాడినా, ఫరవాలేదు. అయ్యో... మాట్లాడేశానే! అని బాధపడకుండా, తిరిగి మౌనం కొనసాగించండన్నారు.

## మెహెరాబాద్‌లో పసిడి వేడుకలు

మెహెర్‌బాబా 1965 మే 1 నుండి 6 వరకు పూణేలోని గురుప్రసాద్‌లో తన ప్రేమికులకు బహిరంగ దర్శన కార్యక్రమం నిర్వహించి నేటికి 50 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా మెహెరాబాద్‌లో ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకునేలా స్వర్ణోత్సవ కార్యక్రమాలను **2015 నవంబరు 13, 14 తేదీలలో** ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మౌనం రెండు రకాలు

**(డా. కేశవరావు, విజయవాడ)**



మౌనం రెండు రకాలని బాబా సూచించారు.

1. **బాహ్యంగా - నోరు మెదపకుండా మౌనం పాటించడం.**

**2. ఆంతరంగికంగా - మనస్సును కట్టడి చేస్తూ మౌనం పాటించడం.**

పెదవులు మూసుకుని బాహ్య మౌనం పాటించడం తేలికైనదే.

ఐతే, ఆంతరంగిక మౌనం చాలా కష్టమని బాబా అన్నారు.

ఆంతరంగిక మౌనంలో మనస్సును మౌనంగా ఉంచే ప్రయత్నం చేయండి.

నాలికతో మనం మాట్లాడతాం. పెదవులు మూసేస్తే - అది బాహ్య మౌనం అవుతుంది.

మనస్సుకు కూడా ఒక నాలుక వుంటుంది. అది నిరంతరం ఎడతెరిపిలేకుండా మాట్లాడుతుంటుంది. మనస్సు తన మానాన తాను అలా తన పనేదో చేసుకుపోతుంటే మనస్సు మాట్లాడుతున్నట్లేనని బాబా అన్నారు. కాబట్టి మనస్సు యొక్క పెదవులను గట్టిగా మూసివేయాలన్నారు బాబా. మనస్సుని మౌనంగా వుంచడమంటే, మనస్సుతో ఎలాంటి ఆలోచనలు చేయకుండా ఉండటమే.

కానీ అది చెప్పినంత సులువైంది కాదని బాబా పేర్కొన్నారు.

కేవలం 12 సెకండ్లు మనస్సును మౌనంగా ఉంచడం దుర్లభం అన్నారు.

ఎవరైనా మనస్సుని 12 సెకండ్లు మౌనంగా ఉంచగల్గితే, వారు ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతిని పొందినవారుగా అర్థం చెప్పుకోవచ్చని బాబా అన్నారు.

మీలో చాలామందికి అప్పుడప్పుడు క్షణకాలం స్తంభించినట్లౌతుంటుంది.

ఐతే అది మనస్సుని నియంత్రించినట్లు కాదన్నారు. మనస్సుని ఆలోచింపనీయకుండా చేయడం లేదా మనస్సుని ఏదో ఒక విషయంపైనే కేంద్రీకరించడం - ఈ రెండూ ఒక్కటేనన్నారు. మనస్సులో ఎలాంటి ఆలోచనలు రాకుండా నియంత్రించడం కష్టమైతే, ఏదేని ఒక లక్ష్యంవైపు మనస్సుని లగ్నంచేయడం చక్కని ఔషధం అని బాబా సూచించారు.

# బాటసారులు

మస్తులు (బాటసారులు) ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో వున్న అసాధారణ వ్యక్తులు. వారికి వారి పరిసరాల గురించి కానీ, వారు చేసే పనుల గురించి కానీ, మరి వారి దేహం గురించి కూడా ఏమాత్రం పట్టించుకోరు. వారు ఎల్లవేళలా భగవత్ సాన్నిధ్యంలో గడుపుతారు. వారు భగవంతుడిలో ఐక్యం కోసం పరితపిస్తారు. మనబోటివారికి వారు పిచ్చివాళ్ళులాగా కనిపిస్తారు. ఈ అవతార కాలంలో మెహెర్‌బాబా మస్తులతో గడిపినంతగా మరి ఇతర అవతారాలలో జరగలేదు. ఈ స్థూల ప్రపంచంతో సంబంధం లేకుండా వున్న మస్తులు భగవంతునికి ఒక ఆధ్యాత్మిక ప్రతినిధిగా ఎంతో చురుకుగా సహకరిస్తారు. మెహెర్‌బాబా మాటల్లో చెప్పాలంటే... నాకు అత్యంత సంతోషకర విషయం ఏమంటే మస్తుల సాంగత్యమేనన్నారు. నేను వారిని ఎంతో ప్రేమిస్తానన్నారు. వారు బలవంతులైన సైనికులతో సమానమన్నారు. వారు భగవంతునితో, భగవంతునిలో, భగవంతుని కొరకు జీవిస్తారన్నారు బాబా. వారు మాయను జయించిన వీరులని బాబా వర్ణించారు. మస్తులందరికీ నేను మాతృమూర్తినన్నారు. మస్తులనేవారు లేకుంటే భగవంతుడి ఉనికే లేదని బాబా ప్రకటించారు. మస్తులతో సాంగత్యం కోసం, వారి అన్వేషణలో భాగంగా కార్లల్లో, రైళ్ళల్లో, బస్సుల్లో, ఎద్దుల బండ్లపై అలాగే కాలినడకన రాత్రనకా-పగలనకా అనేక కష్టాలకోర్చి కొన్ని వేల మంది మస్తులతో బాబా సాంగత్యం చేశారు. మహారాష్ట్రలోని రాహూరీ గ్రామంలో మస్తుల కోసం 1936లో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. ఆ తర్వాత ఆజ్మీర్, జబల్‌పూర్, బెంగళూర్, మెహెరాబాద్, రాంచీ, హైదరాబాద్, సతారా, వంటి ఏడు ప్రాంతాలలో బాబా మస్తు ఆశ్రమాలను నెలకొల్పారు. మస్తులతో బాబా తన ఆంతరంగిక ఆధ్యాత్మిక కార్యక్రమం ముగియగానే ఈ ఏడు ఆశ్రమాలను ఒక్కొక్కటిగా మూసివేశారు. 1957 వరకూ బాబా మస్తుల అన్వేషణలో నిరంతరం శ్రమించారు. ఆ దరిమిలా ఎంపిక చేసిన కొంతమందిని మాత్రమే తన వద్దనే వుంచుకుని వారితో తన ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. **'THE WAYFARERS'** అనే గ్రంథంలో డా॥ విలియం డాంకిన్ అనే పాశ్చాత్య బాబాప్రేమికుడు బాబా మస్తులతో జరిపిన కార్యక్రమాలను సమగ్రంగా గ్రంథస్తం చేశాడు. ఆసక్తిగలవారికి మస్తుల గురించి సమస్త సమాచారం ఆ గ్రంథంలో లభిస్తుంది. కాగా, ఈ శీర్షికలో గత నెల సంచికలో మహ్మద్ మస్తు గురించి సంక్షిప్తంగా తెలుసుకున్నాం. కాగా, ఈ సంచికలో చట్టి బాబా గురించి సంక్షిప్త సమగ్ర సమాచారం అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సంచికలలో కరీంబాబా, ఆలీ షా, చాచా మస్తుల గురించి ప్రచురించనున్నాం. దయచేసి పరిశీలించండి.

బాటసారులు

# చట్టి బాబా



చట్టి బాబా తమిళనాడుకు చెందినవాడు. తమిళంలో **చట్టి అంటే మట్టి కుండ** అని అర్థం. ఓ మట్టి కుండ ఆయన దగ్గర ఎప్పుడూ వుంచుకునేవాడు. అలాగ, చట్టితో వుండేవాడు కాబట్టి, ఈయన్ని స్థానికులు చట్టి బాబా అని పిలిచేవారు. చట్టి బాబా ఆరవ భూమికకు చెందినవాడని మెహెర్‌బాబా ప్రకటించారు. అలాగే ఆయన **జమాలి** రకం మస్తు అని బాబా స్పష్టం చేశారు. జమాలీ రకం మస్తులు మృధుస్వభావులుగా వుంటారు. కోపంగా, ఉగ్రనరసింహులుగా వుండే మస్తులను **జలాలి** మస్తు అని పిలుస్తారు. జమాలి రకం మస్తు అంటే సాధారణంగా అణుకువగా, సాధువుగా వుంటాడు.

మంచి వయస్సులో వుండే రోజుల్లో చట్టి బాబా రైల్వేస్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం చేశాడు. రైల్వే స్టేషన్ మాస్టర్ లాగా ఒక స్టేషన్ నుండి మరొక దానికి సిగ్నల్స్ పంపుతున్నట్లు, తన క్రింద పనిచేసే సిబ్బంది సరిగ్గా పనిచేయకపోతే వారిపై కోపంగా ఇంగ్లీషులో – తమిళంలో అరుస్తూ కనిపించేవాడు.
చెన్నైకి సమీపంలోని నాగపట్నం దగ్గర జాతీయ రహదారికి ఒక ప్రక్కగా దాదాపు రోడ్డుపైనే ఆయన మకాం వుండేది.
స్థానికులు చట్టి బాబాను ఆధ్యాత్మిక జ్ఞానిగా గౌరవించే వారు.
ఆ దారిన వెళ్ళేవారందరూ తప్పకుండా చట్టి బాబాకు సాష్టాంగ ప్రణామం చేసేవారు.
అలాంటివారికి నేల మీద నుండి చిటికెడు మట్టిని తన చేతిలోకి తీసుకుని తన ప్రసాదంగా ఇచ్చేవాడు.
దాన్ని వారు పరమానందంతో నుదిటిన బొట్టుగానో లేదా విభూతిలా భక్తితో ఒంటి నిండా రాసుకునేవారు.
నడుముకి గోచీ పెట్టుకునేవాడు.

నాలుగు పాత బట్టల మూట, ఒక మట్టి కుండ తన దగ్గర ఎప్పుడూ ఉంచుకునేవాడు. ఆయన్ని ఆరాధించేవారు తమతో తెచ్చిన ఆహారాన్ని ఆ మట్టి కుండలో వేసేవారు.
1939 నవంబరులో మెహెర్‌బాబా తన మండలి వారితో కలిసి బెంగుళూరులో వున్నారు. ఆ రోజుల్లో బాబా మస్తు ఆశ్రమాన్ని బెంగుళూరులో నిర్వహించారు. మస్తుల అన్వేషణలో భాగంగా మండలివారు – కాకాబారియా, ఏరుచ్‌లు నాగపట్నంలో చట్టి బాబాను చూసి తమ వెంట బెంగుళూరు రమ్మనమని కోరారు. ఐతే, చట్టి బాబా వెంటనే బయలుదేరడానికి ఒప్పుకోలేదు. తాను రాలేనన్నాడు. "నాగపట్నంలో నా పిల్లల బాగోగులు చూడాలి కాబట్టి, బెంగుళూరుకు తర్వాత ఎప్పుడైనా వస్తానన్నాడు. రెండు వారాల తర్వాత, ఏరుచ్ – కాకాబారియాలు తిరిగి రెండు చిన్న కార్లలో నాగపట్నం బయల్దేరారు. చట్టిబాబాను ఎలాగైనా సరే బాబా దగ్గరకు తీసుకెళ్ళేందుకు నిర్ణయించుకుని నాగపట్నం వచ్చారు. చట్టి బాబాను కలిశారు. తమతో ఆయన్ని బెంగళూరు తీసుకెళ్ళడానికి చిన్నకారు తీసుకొచ్చామన్నారు. ప్రేమతో అంగీకరించి రమ్మనమన్నారు.
మండలి సభ్యులు ఎంత వేడుకున్నా ముందుగా ఒప్పుకోకపోయినా, చివరాఖరికి వారితో బెంగుళూరు వెళ్ళడానికి అంగీకరించాడు.
వెంటనే చట్టి బాబాను కారులో ఎక్కించుకుని, ముందుగా తంజావూరు చేరుకున్నారు. ఆ రాత్రికి అక్కడే ఒక సత్రంలో బస చేశారు.
ఐతే, ఆ రోజున నడి రాత్రి 2 గంటలప్పుడు చట్టిబాబా లేచి కూర్చుని, తనకు ఊపిరి ఆడడం లేదన్నాడు. ఆకలేస్తోందన్నాడు.
కాకాబారియా అప్పటికప్పుడు అన్నం వండి తినిపించాడు.
భోజనం అయ్యాక అలా కొద్దిసేపు చంద్రుని చల్లని నీడలో నడవాలని వుందన్నాడు. మరో మండలి సభ్యుడు, జాల్ కేరేవాలాతో కల్సి చట్టిబాబా వ్యాహ్యాళికి బయల్దేరాడు.
అలా వెళ్ళిన చట్టి బాబా, తిరిగి సత్రానికి వెళ్దామంటే ఎంతసేపటికీ ఒప్పుకోడు. రోడ్డుపైనే చతికలబడ్డాడు. వాళ్ళు ఏపాటికీ తిరిగి సత్రానికి రాకపోయేసరికి, వారిని వెదుక్కుంటూ కాకాబారియా బయల్దేరాడు.
కాకాబారియా ఎంత బ్రతిమలాడినా సత్రానికి రావడానికి చట్టి బాబా ఇష్టపడడు. తన మానన తనను వదిలిపెడితే, కాకా బారియాకు పది అణాలు నజరానా ఇస్తానన్నాడు. నేను మీతో రాను. మీ దారిని మీరెళ్ళండని కాకా బారియాను హెచ్చరించాడు. కాకాబారియా అప్పటికే బాగా అలసిపోయాడు. ఈ ప్రయాణంతో బాగా విసుగెత్తి పోయాడు. దాంతో, నీవు మాతో బెంగుళూరుకైనా రావాలి లేదంటే నిన్ను తీసుకెళ్ళి మీ ఊర్లో వదిలి పెడతానన్నాడు.

దాంతో చట్టి బాబా మెత్తబడ్డాడు. వారితో కలిసి బెంగుళూరు బయల్దేరాడు.
అలా బెంగుళూరుకు చేరుకున్న చట్టిబాబాకు మెహెర్‌బాబా స్నానం చేయించి,
ఆ తర్వాత కడుపు నిండా అన్నం కలిపి నోట్లో పెట్టారు.
బాబా దగ్గర వున్నన్ని రోజులూ,
చట్టి బాబాకు ప్రతి రోజూ బాబా సబ్బుతో స్నానం చేయించారు.
ఆ తర్వాత తువ్వాలుతో చంటి బిడ్డను తుడిచినట్లు శుభ్రంగా తుడిచి,
ఉతికిన బట్టలు వేసేవారు. ఐతే చట్టి బాబాకు ఒక వింత అలవాటు ఉండేది.
అదేమంటే స్నానం చేశాక,
తిరిగి వీధిలోకి వెళ్ళి, మట్టిలోకి తన చేతి వేళ్ళు పోనించి,
ఆ దుమ్ము – ధూళినంతా నెత్తి మీద పోసుకునేవాడు.
ఇదంతా చంటి పిల్లవాని చేష్టలుగా అగుపిస్తుంది.
చట్టి బాబాకు అటెండెంట్‌గా బాబా శిష్యుడైన కృష్ణనాయర్‌ను బాబా నియమించారు.
చట్టి బాబా కోసం, కృష్ణ నాయర్ ఓ 15 బక్కెట్ల నిండా మట్టిని నింపి
ఆయన గదిలో ఉంచేవాడు. చట్టిబాబా మెహెర్‌బాబాను తన పెద్దన్నగారనే వాడు.
మెహెర్‌బాబా చాలా గొప్పవాడు. ఆయన మాదిరి మరొకరు ఈ ప్రపంచంలోనే
లేరని, కృష్ణ నాయర్‌తో పలుమార్లు చెప్పాడు. చట్టి బాబా బాగా చదువుకున్నవాడైనా
ఎన్నడూ న్యూస్ పేపర్లులాంటివి చదివేవాడు కాదు. ప్రాపంచిక విషయాలు ఏమీ
పట్టనట్లున్నా ప్రపంచంలో జరుగుతున్న ప్రతిదీ ఆయనకు తెలుసు.
ఒకరోజున ఎప్పటిలా నెత్తిమీద మట్టి పోసుకుంటూ ప్రపంచంలో ఎక్కడ చూసినా
అలజడులు జరుగుతున్నాయి. అశాంతి తాండవిస్తోంది.
దీన్ని మెహెర్‌బాబా ఒక్కడే నివారించగలడని కృష్ణనాయర్‌తో అన్నాడు.
చట్టి బాబాకు ఫ్రాన్స్ దేశంతో సంబంధముందని బాబా పేర్కొన్నారు.
ఇందుకు సంబంధించిన అనేక విషయాలు రానున్న పుటలలో మరింత తేటతెల్లమౌతుంది.
ఆ రోజు 1940 జూన్ 5. అర్ధరాత్రి ఒంటి గంటకు చట్టి బాబా లేచి కూర్చుని
చేతిలో లాంతర చేపట్టి బాబా గదిలోకి వచ్చేశాడు. ఇది చూసిన మండలి సభ్యులు
సావక్ కొత్వాల్ –మరి కొంతమంది ఆతడిని వెంబడించి ఏం జరిగిందని..
అలా బాబా గదిలోకి వెళ్తున్నావ్ అని అడిగితే, ఏం లేదని ముక్తసరిగా జవాబిచ్చాడు.
ఆ మర్నాడు తన గదిని తాను తుడిచి శుభ్రం చేశాడు.
ఆ మాదిరిగా తన గదిని అతను అలా ఎన్నడూ శుభ్రపరచ లేదు.
తిరిగి 1940 జూన్ 6న చట్టి బాబా తిరిగి బాబా గదికి వెళ్ళి తలుపు ప్రక్కగా నిలుచున్నాడు.
ఇక మా ఊరికి వెళ్ళిపోతానని బాబాతో అన్నాడు. బాబా తన మండలివారి నౌకరిని
పిలిచి అలా ఆశ్రమం బయటకు చట్టి బాబాను తీసుకెళ్ళమన్నారు.

అలా బయటకెళ్ళిన చట్టి బాబా స్త్రీ మండలివారు ఉండే క్వార్టర్సు వైపు వెళతానని మారాం చేశాడు. అలా వెళ్ళకూడదని ఎంత వారించినా
చిన్నపిల్లవాడిలా మొండికేసి అటువైపు వెళ్ళాల్సిందేనని పట్టుపట్టాడు.
ఈ విషయం బాబాకు తెలిసి, చట్టి బాబా కోసం కారు పంపారు.
కార్లో ఎక్కించి, వాళ్ళ ఊరికి తీసుకెళుతున్నామని చెప్పమన్నారు.
నవ్వుతూ కారెక్కిన చట్టి బాబాను తిరిగి ఆయన గదికి తీసుకెళ్ళారు.
ఆ రోజు రాత్రి ఎనిమిది గంటల దాకా చట్టి బాబా అవిశ్రాంతంగానే వున్నాడు.
గది తలుపులు వేస్తూ – తీస్తూ కూర్చున్నాడు.
జూన్ 8న అయితే తన గదిలోనే గడియ వేసుకుని స్నానానికి
కూడా బయటకు రాలేదు. ఆ మర్నాడు జూన్ 9, ఆదివారం నాడు చట్టి బాబా చాలా తీవ్ర ఆందోళనతో వున్నాడు. కనిపించిన ప్రతివారిని తిడుతూ చాలా కోపంగా వున్నాడు.
ఆ తర్వాత నేరుగా బాబా గదిలోకి వెళ్ళాడు.
"నా ఇల్లు తగలబడిపోతోంది. సర్వ నాశనం అవుతోంది.
నీ నీడన క్షేమంగా వుండాలని వచ్చాను. కానీ జరుగుతున్నది మరొకటి అన్నాడు.
చట్టి బాబాను తన గదిలోనే ఆ రాత్రికి వుండనీయమన్నారు బాబా.
బాబాతో కూడా ఆ రాత్రంతా ఏదో గొడవ పడుతూ కోపంగా మాట్లాడుతూనే వున్నాడు.
ఆ తర్వాత చాలాసేపటికి కోపం తగ్గి శాంతించాడు.
ఆ రోజు రాత్రంతా బాబావారి గదిలోనే చట్టి బాబా వున్నాడు.
ఆ మర్నాడు ఏమీ ఎరుగనట్లు తన మానాన తన గదికి వెళ్ళిపోయాడు చట్టి బాబా.
చట్టి బాబా ఆందోళనకు, ఆగ్రహానికి కారణం బాబా వివరిస్తూ ఇలా అన్నారు.
చట్టి బాబాకు ఫ్రాన్స్ దేశంతో అనుబంధం వుంది.
రెండవ ప్రపంచ యుద్ధంలో ఆ దేశంలో జరుగుతున్న ఘోర కలికి చట్టి బాబా ఆ రోజు రాత్రి అలా ప్రవర్తించాడని అన్నారు. 1940 జూన్ 5న ఫ్రెంచి సైన్యం పరాజయం, ఎనిమిది రోజుల తర్వాత పారిస్‌లోకి జర్మన్‌ల ప్రవేశం జరిగింది.
ఈ సమయంలోనే చట్టి బాబా తానేమీ చేయలేకపోతున్నాను.
ఏమైనా వారికి సహాయం చేయాలంటే **నా పెద్దన్న** మాత్రమే **(మెహెర్‌బాబా)** చేయగలడని అంటుండేవాడు. చట్టి బాబా సాధు స్వభావం గల జమాలీ రకపు ఆరవ భూమికలో వున్న మస్తు అని బాబా ప్రకటించారు. అలాగే – కోపం – ఆగ్రహంతో కొన్నిసార్లు జలాలి రకపు మస్తుగా కూడా చట్టి బాబా ప్రవర్తిస్తాడన్నారు.. మస్తులతో బాబా ఏకాంతంగా కలవడానికి ఎందుకు ఇష్టపడతారో ఆయన ఎప్పుడూ వివరంగా చెప్పలేదు. కానీ, ఏరుచ్ బాబాతో వున్న అనుభవంతో ఇలా చెప్తారు.
బాబా తన ఆంతరంగిక కార్యక్రమ నిర్వహణకు అనుకూలంగా వుండేందుకు వారితో

ఏకాంతంగా కలిసేవారు. అలాగే, మస్తులకు గనుక కోపం వస్తే,
భౌతిక దాడులకు దిగే అవకాశం కూడా వుంది.
దానివల్ల ఎవరికీ నష్టం కల్గకుండా ఉండేందుకు వీలుగా మనుష్య సంచారానికి
దూరంగా ఏకాంతంగా మస్తులతో బాబా సాంగత్యం చేసేవారని
తన అభిప్రాయంగా ఏరుచ్ వివరించాడు.
తన అనుభవాన్ని మరొకటి ఏరుచ్ వివరిస్తూ, ఒకసారి మెహెర్‌బాబా చట్టి బాబాతో
రెండు గంటలు ఏకాంతవాసంలో వున్నారు.
ఆ కార్యక్రమం తర్వాత చట్టి బాబా తన గదిలోకి వెళ్ళడానికి బయటకొచ్చినప్పుడు –
అక్కడే వున్న నాకు వెన్నులోంచి విద్యుత్ ప్రసరించినంత షాక్ కొట్టిందని, ఏరుచ్ తన
అనుభవాన్ని వివరించాడు. ఇదొక మచ్చుతునక మాత్రమేనన్నాడు ఏరుచ్.
1940 నవంబరులో బాబా సిలోన్ (శ్రీలంక) మరి ఇతర ప్రాంతాల
పర్యటనకు వెళ్ళారు. సిలోన్‌కు చట్టి బాబాను కూడా తన మండలివారితో తీసుకెళ్ళారు.
ఆ తర్వాత కాలికట్, కేరళలలో పర్యటించిన బాబాతో చట్టి బాబా కూడా వున్నాడు.
ఆ సమయంలో నేను నా ఊరికి వెళ్ళిపోతాను.
ఇక్కడ క్షణం కూడా వుండనని చట్టిబాబా గట్టిగా చెప్పేవాడు.
ఒకరోజున ఎలాంటి ఇబ్బంది లేకుండా, చట్టిబాబా ఏం చేశాడనుకున్నారు,
తన గది తలుపులు – కిటికీలకున్న అద్దాలన్నింటినీ ముక్కలు ముక్కలుగా పగుల
కొట్టాడు. అకారణంగా అతను ఈ పనికి పూనుకున్నాడు.
నేలపై చీపురుతో గట్టిగా కొట్టడం మొదలెట్టాడు. బాబా తన దగ్గరకు రమ్మనమని
కబురు పంపారు. దాంతో గదిలోపల నుండి గడియపెట్టేసుకుని, నా ఆరోగ్యం బాగాలేదు.
అందరూ ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి. బాబా కూడా వెళ్ళిపోవాలి అని గట్టిగా కేకలు
పెట్టాడు. ఐతే, వర్షం వచ్చేముందు ఆకాశంలో ఉరుములు మెరుపులు లాగా,
కొద్దిసేపటి తర్వాత చట్టిబాబా ప్రశాంతంగా ఏమీ ఎరుగనట్లు వున్నాడు.
మరోసారి జైపూర్‌లో వుండగా మరో సంఘటన జరిగింది.
జనవరి మాసం, బయట ఎముకలు కొరికే చలి వుంది.
ఒంటి మీద వున్న గుడ్డలు అన్నీ విడిచేసి, ఓ రాత్రి అంతా ఆరుబయట అర్ధనగ్నంగా
కూర్చున్నాడు. మూడు నాలుగు రగ్గులు కప్పుకుని చలికి వణుకుతున్న మండలివారిని
చూసి పకపకా నవ్వుతూ – **చలిగా వుందా?** అంటూ నవ్వుతూ నిల్చున్నాడు.
నా పెద్దన్న గారు ఈ ప్రపంచం కోసం ఇంకా చాలా పని చేయాల్సి వుంది.
నాకయితే అంత సహనం, ఓపిక లేదని జైపూర్‌లో వుండగా మండలివారితో చట్టిబాబా
గట్టిగా అన్నాడు. 1941లో మెహెర్‌బాబాతో చట్టిబాబా క్వెత్తాలో పర్యటించాడు.
క్వెత్తాలో బాబా తన స్త్రీ మండలికి చట్టిబాబాను చూపించారు.

ఆ రోజుల్లో క్వెట్టాలో మంచు కురుస్తోంది. చాలా చలిగా వుంది. నీళ్ళు గడ్డకడుతున్నాయి. అలాంటి సమయంలో చట్టిబాబా చన్నీళ్ళ స్నానం చేయడమే కాకుండా, తాను పడుకునే పరుపు – దిండుపై వేడిగా వుందని చల్లని నీళ్ళు చల్లుకున్నాడు. ఒకరోజున వడగళ్ళ వాన కురిసింది. పెద్ద పెద్ద మంచు గడ్డలు పడ్డాయి.

ఒక్కొక్క మంచుగడ్డ కరగడానికి సుమారు 3–4 గంటలు పట్టింది.

అలాంటి సమయంలో నడుము దగ్గర గోచీ లాంటిది మాత్రం ధరించి,

ఒంటిమీద దుస్తులు లేకుండా గంటలసేపు ఆరు బయట కూర్చున్నాడు చట్టి బాబా.

ఘోర కలికాలం ఎవరూ ఊహించలేనిది త్వరలో వస్తోందని చట్టిబాబా ప్రకటించాడు.

అశాంతి, అరాచకాలు ప్రజ్వరిల్లుతాయన్నాడు.

సొంత అన్నదమ్ములే కలహించుకుంటారని, ఒకరినొకరు చంపుకుంటారని హెచ్చరించాడు.

ఆ సమయంలో యావత్తు ప్రపంచం మా పెద్దన్నను శరణు కోరతారన్నాడు.

నా పెద్దన్నను ఆరాధిస్తారనీ అన్నాడు. చట్టిబాబా తన పనిని చేసుకుంటూనే తరచు **'అల్లాహో అక్బర్'** అని భగవంతుడ్ని స్మరిస్తుండేవాడు.

బాబా డెహ్రాడూన్‌లో వున్న సమయమది. ఆ సమయంలో బాబా 21 రోజులు ఉపవాసం వుండి చట్టిబాబాతో ఏకాంతంగా తన ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. చట్టిబాబా గదికున్న కిటికీలను మూసివేసి, బయట నుంచి లోనికి చూసినా కనపడనట్లు కిటికీ అద్దాలను పేపర్‌తో అతికించారు. ఆఖరి రెండ్రోజులు చట్టిబాబా కూడా బాబాతోపాటు ఉపవాసం వున్నాడు. బాబా ఆహారం ఏమీ తీసుకోవడం లేదు కదా!! నేను కూడా ఏమీ తీసుకోనని చట్టిబాబా అన్నాడు.

అజ్మీర్‌లో బాబాతో చట్టిబాబా వున్న సమయంలో జరిగిందీ సంఘటన.

చట్టిబాబాకు సహాయంగా బాబా ప్రేమికుడు కృష్ణనాయర్ ఉన్నాడని చెప్పుకున్నాం కదా!! ఆ సమయంలో ఈ మస్తులతో, బాబావారి ఆదేశాలతో విసుగెత్తిన కృష్ణనాయర్ ఇక అక్కడ నుండి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

కృష్ణనాయర్ మనస్సు తెలిసిన చట్టి బాబా, ఎక్కడకు పోవాలనుకుంటున్నావ్! ప్రపంచం మొత్తం మెహెర్‌బాబా శక్తి ఆవహించి వుంది.

కాబట్టి నీవెక్కడికి వెళ్ళినా బాబా అక్కడ వుంటాడు.

మహాసముద్రుడు వంటివాడు బాబా.

ఒకరోజున యావన్మంది ప్రజలు ఆయన పాదాల చెంతకు వచ్చిచేరతారు.

అప్పుడు బాబాను దూరం నుండి దర్శించుకునే అవకాశం కూడా నీకు లభించదు.

నీకు ప్రస్తుతం లభించిన ఈ అవకాశాన్ని వదులుకోవద్దు అని చట్టి బాబా కృష్ణనాయర్‌కి కనువిప్పు కలిగించాడు. 1941 సెప్టెంబరు మాసం.

బాబాతోపాటు చట్టిబాబా పూణేకు సమీపంలోని పంచగనిలో వున్నారు.

ఆ సమయంలో ఇక తాను తన ఊరికి వెళ్ళిపోవాలని చట్టిబాబా పట్టుపట్టాడు.
ఇక ఏమాత్రం ఉండలేనని నడుచుకుంటూ
కొన్ని మైళ్ళ దూరం వెళ్ళిపోయాడు.
మండలివాళ్ళు ఆయన్ని వెంబడించి,
బుజ్జగించి బాబా దగ్గరకి తీసుకొచ్చారు.
ఎలాగో ఓ వారం రోజులపాటు ఉగ్గబట్టుకుని పంచగనిలో బాబాతోపాటు వున్నా
తిరిగి తాను వెళ్ళిపోవాల్సిందేనని ఓరోజు పట్టుబట్టాడు.
బాబా కఠిన ఏకాంతవాసంలో వున్నారు.
ఐనప్పటికీ చట్టి బాబా సంగతి తెలుసుకుని బాబా ఆయన దగ్గరకు వచ్చారు.
బాబాతో కూడా తన ఊరు వెళ్ళాల్సిందేనని గట్టిగా పట్టుపట్టాడు.
గట్టిగా ఏడుస్తూ ఇక తనను తన ఊరికి పంపించమని వేడుకున్నాడు.
బాబా కూడా అందుకు అంగీకరించారు.
ఆయన కూర్చున్న కారు దిగలేదు.
కారులో ఉండగానే బాబా ఆయనకు కడుపునిండా అన్నం స్వయంగా తినిపించారు.
ఆ పిదప బైదుల్ – కృష్ణనాయర్‌లు చట్టిబాబాను కారులో నాగపట్నం తీసుకెళ్ళారు.
అలాగ, సుమారు 2 సంవత్సరాలు బాబా సమక్షంలో వున్న చట్టి బాబా
తన ఊరికి వెళ్ళిపోయాడు.
చాలా సంవత్సరాల తర్వాత బాబా తమిళనాడులో పర్యటిస్తూ,
తిరువళ్ళూరు ప్రాంతానికి వెళ్ళారు.
అక్కడ చట్టి బాబా కోసం వెదకి ఆయనతో బాబా ఆఖరిసారిగా ఏకాంతంగా
తన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.
అప్పటికి చట్టి బాబా చాలా ముసలివాడయ్యారు.
ఆ మస్తు ప్రక్కనే బాబా చాలాసేపు కూర్చున్నారు.
అరటి పండ్లు తినిపించారు.
చట్టి బాబాను చూసేవారెవరూ లేరు.
ఒంటరిగా ఊరి చివరన రోడ్డుకు ఒక ప్రక్కగా చిరిగిన గుడ్డలపై పడుకుని వున్నాడు.
చట్టి బాబా స్థితిని చూసి బాబా చలించిపోయారు.
అనంతరం చట్టి బాబా శిష్యులతో ఈ మస్తు త్వరలో శరీర త్యాగం చేస్తాడు.
ఆయన జ్ఞాపకార్థం చిన్న సమాధిని నిర్మించండని చెప్పి
వారికి కొంత ధన సహాయం కూడా మెహెర్‌బాబా అందజేశారు.
ఆ తర్వాత కొన్నాళ్ళకు మస్తు తనువు చాలించాడని తెల్సింది.

*



# బాబాలో ఐక్యం

పార్వతీపురం మెహెర్‌బాబా కేంద్ర అనుబంధ కేంద్రమైన నేలావడి/ ఒడిస్సా వాస్తవ్యులు నీలావడి కేంద్ర స్థాపకులు, బాబా ప్రేమికులైన శ్రీ డి.ఎల్.వి. ఆచారి 27.05.2015 మధ్యాహ్నం 2.30 గం.లకు బాబా నామస్మరణతో అంతిమ శ్వాస విడిచారు. వీరు నీలావడిలో బాబా కేంద్ర నిర్మాణం సగం వరకు పూర్తి చేశారు.

***

ఖమ్మం సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ యం.సింహారెడ్డి గారి భార్య శ్రీమతి యం. మాణిక్యమ్మ (78) 22.05.2015న బాబాలో ఐక్యమయ్యారు.

## అవతార్ మెహెర్‌బాబా 179వ ప్రేమిక సహవాస్

14.06.2015 రెండవ ఆదివారం మెహెర్‌స్థాన్ కొవ్వూరులో 179వ సహవాస్ కార్యక్రమము నిర్వహించారు.

## సిరిసిల్లా బాబా సెంటర్ 13వ వార్షికోత్సవం

తెట్టికుంట బాబా సెంటర్ 13వ వార్షికోత్సవం 21.06.2015 ఆదివారం ఉ. 7 నుండి సా.6 వరకు ఏర్పాటు చేసినట్లు శ్రీ డి. ప్రభాకరరావు, ట్రస్ట్ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, సిరిసిల్లా బాబా సెంటర్ 32వ వార్షికోత్సవం 20.06.2015 శనివారం ఉ. 7 నుండి రాత్రి 9 వరకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరి, శ్రీమతి రాజశ్రీ కల్చూరి, శ్రీమతి సుభశ్రీ దేవ, శ్రీ జోన తోంప్‌కిన్, శ్రీ రమేష్ లక్ష్మన్ జంగ్లీ, శ్రీమతి జయశ్రీ రమేష్ జంగ్లీ, డా॥ ఎ. నాగేంద్ర, అడిషనల్ జాయింట్ కలెక్టర్, కరీంనగర్, శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ ఎస్.వి. మెహెర్ ప్రసాద్ రాజు తదితరులు పాల్గొంటునట్లు శ్రీ ప్రభాకర్ తెలిపారు.

**ఈ ఏడాది వేసవిలో విజయనగరం, హైదరాబాద్‌లోని మల్కాజిగిరి బాబా సెంటర్ల అధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ మే నెల 31వ వరకు దాహార్తులకు అందజేసినట్లు సమాచార భోగట్టా.**

# విశాఖ బాబా కేంద్రం 44వ వార్షికోత్సవం

విశాఖపట్నం బాబా కేంద్రం 44వ వార్షికోత్సవం 31.05.2015 ఘనంగా నిర్వహించారు. ముందుగా, శ్రీ అసిరప్పుడు, పూతికపేట, సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం బాబావారి ప్రార్ధనలు, సంకీర్తనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బాబా సందేశాలపై మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నుండి వచ్చిన డా॥ జి.ఎస్. దూబె ప్రసంగించారు. దూబె గారి హిందీ ప్రసంగ పాఠవాన్ని శ్రీమతి మధవీ లత తెలుగులో అనువదించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అద్దంకి రాఘవాచారి, శ్రీ ఎల్.వి.ఆర్. మూర్తి, శ్రీ టి.డి.ఎస్. మూర్తి, శ్రీ కె.వి. రత్నం, తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

# విజయనగరం బాబా కేంద్రం నూతన కార్యవర్గం

అవతార్ మెహెర్‌బాబా విజయనగరం కేంద్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ ఐ.వి. సన్యాశిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

**గౌరవ అధ్యక్షులు:** శ్రీ చాగంటి అఘోరపతి,
**అధ్యక్షులు:** శ్రీ పి. రాజేశ్వరావు,
**కార్యదర్శి:** శ్రీ కె.వి. రమణమూర్తి,
**ఉపాధ్యక్షులు:** శ్రీ బాలి త్రినాధ, శ్రీమతి ఎస్. అనసూయమ్మ,
**సంయుక్త కార్యదర్శి:** శ్రీ యం. కమలాకర్, శ్రీమతి యం. సత్యవతి,
**కోశాధికారి:** శ్రీ నల్లా మెహెర్‌శ్రీని,
**కార్యవర్గ సభ్యులు:** సర్వశ్రీ కొల్లి రామారావు, వడ్డాది గోపాలరావు, సి.వై. చింతామణి, దాసరి వెంకటరావు, పి. సత్యం, యం. పాపారావు, కె. ఉమాదేవి, పి. చిన వెంకన్న, ఎన్.వి.వి. జయలక్ష్మి, జి. శమంతకము, ఎస్. జగదాంబ, వీరేశలింగం, సూర్యకుమారి.



## భారతీ మణి బాబాలో ఐక్యం

శ్రీ సి.వై.చింతామణి, విజయనగరం గారి భార్య శ్రీమతి భారతీ మణి (76) జూన్ 8న బాబా నామస్మరణతో అవతారునిలో ఐక్యమయ్యారు. అనుక్షణం అవతారుని నామస్మరణలో గడిపిన భారతీమణి గత కొంతకాలంగా అస్వస్థతతో వున్నారు. బాబా సేవలో తరించిన ఆమె ధన్యురాలని విజయనగరం సెంటర్ బాబా ప్రేమికులు తెలిపారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - *తెలుగుసేత: మల్లాది రామారావ్,* న్యూఢిల్లీ

***(గత సంచిక తరువాయి)***

ప్రభువు ఎప్పుడు ఎవరిని ఆటపట్టిస్తారో, ఎందుకు ఏడిపిస్తారో ఎవరికీ తెలీదు.
అయితే ప్రభువు చేసే ప్రతి పని వెనుక ఏదో పరమార్థం వుందనీ,
ఏదో కొత్త పాఠం చెప్తున్నారనీ తెలుసు. అయినా చీమూనెత్తురు వున్న మానవులు కదా
ఎంతసేపు ఓపికగా భరించగలుగుతారు.
అది మండలివారైన, మరెవరైనా సరే.
ఉక్రోషంతో ఏమిటయ్యా బాబా తెగ వేధిస్తున్నావంటారు.
ఇంకా కోపం పట్టలేకపోతే పరుషవాక్యం నోటి నుంచి జారవచ్చు.
కావాలని కాదు సుమా.
అంతా పరిస్థితుల ప్రభావం అని సరిపెట్టుకోవాలి.
సరిగ్గా ఇలానే జరిగింది సెప్టెంబరు ఇరవై నాల్గవ తేదీన.
ఆవేళ ఎందుకనో ఏమో, బువాసాహెబ్ వెనకపడ్డారు.
బాబావారు ఆటపట్టించడం మొదలుపెట్టారు.
పాపం మన మిత్రుడు ఏం చేస్తాడు?
బాబావారి సంగతి తెలుసు కాబట్టి సరే నేనిక బలికాక తప్పదు అనుకొన్నాడు.
మౌనం పట్టాడు. బాబావారు ఏమంటున్నా - ఆ మాట ఎద్దేవగా వున్నా,
చెంప చెళ్ళు మనిపించేలా వున్నా సరే నిమ్మకు నీరెత్తినట్లు వున్నాడు.
తల పైకెత్తడం లేదు. ఏమో! ప్రభువుకు కోపం వస్తుందేమో అనుకొన్నట్లున్నాడు.
కిక్కురుమనటంలేదు. బువా మౌనం బాబావారికి మహదానందం కల్గించినట్లుంది,
మరింతగా విజృంభించారు. సూదుల్లా మాటలు బాణాలు సంధించారు.
బాబావారు ఏదో సరదాకి అంటున్నాడా, కోపం వచ్చి నిలదీస్తున్నారా అన్న సందిగ్ధంలో
పడ్డాడు బువా సాహెబ్. మండలివారికీ భయం వేసింది. అయ్యో! బువా!
నీ పని గోవింద ఈవాళ అనుకొన్నారు. ఇదేమీ పట్టని బాబావారు ఆట పట్టించడం
మానలేదు. బువాకి ఉక్రోషం వచ్చింది. నేనేమి తప్పు చేశానని నాపై ఈ దండయాత్ర.
తప్పు చేయకుండానే శిక్ష వేస్తారా. ఇంతమందిలో అవమానిస్తారా అని ఊగిపోయాడు.

అంతే నోరు జారాడు. వెంటనే నాలుక్కరుచుకొన్నాడు.
పొరపాటయింది ప్రభు క్షమించు అని మనస్సులో ప్రార్థించాడు.
బాబావారు హిత వాక్యం ఏమి కాదు. కోపాన్ని దిగమ్రింగడం నేర్చుకో అన్నారు.
సంతోషంగా వుండటానికి ప్రయత్నించు ఎప్పుడూ, అన్నిపరిస్థితుల్లో అన్నారు.
నాకు ఎప్పుడూ బదులు చెప్పకు. వినమ్రంగా వుండు. అలావుండే ప్రయత్నం చేయి సదా అన్నారు. తాము ఏదో సరదాకి కాలక్షేపానికి ఆట పట్టించలేదని స్పష్టం చేశారు. నీ మేలు కోసమే అలా చేశామనీ చెప్పకనే చెప్పారు. తమ వాడి మాటల బాణాల్లో దైవీ ప్రేమ దాగివుందన్నారు. అందువల్ల ఈ బాణాలు ఆత్మోన్నతికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. "నన్ను ఎంతో కాలంగా అంటిపెట్టుకొన్నావు. ధైర్యంగా వుండు", అని బువా సాహెబ్ వెన్నుతట్టారు. నీ ధైర్యం చూసే, పరిష్యా యాత్రకి బయలు దేరామని పొగిడారు. తమని సంతోషపెట్టమన్నారు. ప్రభుని సంతోషపెట్టామన్న సంతృప్తితో హాయిగా ఊపిరి తీసుకో అన్నారు. తాము నాలుగు నెలలపాటు ఏకాంతవాసంలో వుండబోతున్నామని వెల్లడించారు. ఏకాంతవాసం అయిపోగానే మనమందరం ప్రపంచ యాత్రకి వెళ్ళతామని చెప్పారు. బువా సాహెబ్ సంతోషంగా బుర్ర వూపాడు. ప్రభువుకి నాపై కోపం లేదు. అంతా నా మంచికే చేసారు అని పొంగిపోయాడు. "మూర్ఖుడిని, కాస్తంత ఓపిక పడితే పోయేది.
తన కోపమే తన శత్రువు అన్నది పెద్దలు ఇందుకోసమే.
ఇహ మీదయినా జాగ్రత్తగా వుండాలి.
పొరపాటున కూడా నోరుజారకూడదు.
నాకీ శక్తిని నీవే ప్రసాదించు బాబా అని ప్రార్థించాడు.
పురుష మండలికి బాబావారు ప్రత్యేక నియమ నిబంధనలు విధించారు.
పరిష్యా యాత్రలో ఈ నిబంధనల్ని తూ.చ. తప్పకుండా పాటించమన్నారు.

**నిబంధన 1:** ఓడలో కానీ పరిష్యాలో కానీ బాబావారి గురించి మాట్లాడకూడదు.

**నిబంధన 2:** బాబావారి అనుమతి లేకుండా బాబావారి ఫోటోలు, లాకెట్లు, పుస్తకాలు పంచిపెట్టకూడదు.

**నిబంధన 3:** బాబావారు తమ మధ్యనే వున్నారని ఎవరికీ తెలియకూడదు. అలా జరిగితే బాబావారి ఏకాంతవాసానికి భంగం కలుగుతుంది.

**నిబంధన 4:** బాబావారి పని పూర్తయి, స్వయంగా మాట్లాడేవరకూ నలుగురికి తెలియజెప్పే వరకూ మండలివారు బాబావారు చెప్పినట్లు నడుచుకోవాలి. ఎటువంటి హడావుడి చేయకూడదు.

ఈ కొత్త నిబంధనావళిని వింటూనే మన బువా సాహెబ్ గారు ఖంగుతిన్నాడు.
బురదలో కాలువేసా మరోసారి అనుకొన్నాడు.

భయం వేసింది. ఏంచేయాలో పాలుపోలేదు.
ఇంతకీ ఏమయిందీ అంటే రెండు మూడు రోజుల క్రిందట
కె.జె. దస్తూర్ గారు వ్రాసిన మెహెరాశ్రయం పుస్తకాన్ని
తోటి ప్రయాణికుడికి ఇచ్చాడు. అడిగితే ఇచ్చాడా, అడగకుండానే తానంత తానుగా ఇచ్చాడా అన్నది కాదు ప్రశ్న. బాబావారు ఏది చేయకూడదని అన్నారో, ఆ పని జరిగిపోయిందన్నది ప్రస్తుతాంశం. ఏం చేయాలో పాలుపోని బువా సాహెబ్ గారు, తమ తప్పు ఒప్పుకొనివుంటే బాగుండేది.
ఆయన ఆ పని చేయలేదు సరికదా జరగకూడని పని జరిగింది.
ఏం చేస్తాం, అంతా దైవేచ్ఛ అనుకొంటూ పుస్తకం ఇచ్చిన వైనం బయటపెట్టలేదు.
కానీ దాచినా దాగని రహస్యం కాదు కదా అది. ఛాంజీ గారికి తెలిసింది సెప్టెంబరు 25వ తేదిన. అంటే బాబావారి క్రొత్త నిబంధనావళి ప్రకటించిన మర్నాడు అన్నమాట.
వెంటనే ఆయన ఆ సంగతిని బాబావారి దృష్టికి తెచ్చాడు.
బువా సాహెబ్ గారు పుస్తకం ప్రదానం చేసిన పెద్దమనిషిని కలిసి,
మా పుస్తకం మాకు ఇవ్వరా అని అడిగాడు. ఇంకా చదవలేదు.
అయినా ఇంత తొందర ఏమిటి అంటూ చిరాకుపడ్డాడు.
ఆయన ఏ కళనున్నాడో ఛాన్జీ గారికి పుస్తకాన్ని వాపసు ఇచ్చాడు.
ఇదంతా గమనించిన ఓ ఇద్దరు ముగ్గురికి బాబావారి దర్శనం చేయాలనిపించింది.
వెంటనే ఒకరు బాబావారి క్యాబిన్‌కి వచ్చారు.
మరి, ఇదంతా బాబావారికి నచ్చలేదనీ, కోపం వచ్చిందనీ వేరే చెప్పాలా!
బువా సాహెబ్‌పై మండిపడ్డారు.
ఓ ప్రశాంత స్థలంలో వుందామని ఏడేళ్ళుగా ప్రయత్నించాను.
కానీ అటువంటి ప్రదేశం ఎంత వెదికినా దొరకలేదు.
ఇదే ఆఖరి యత్నం. ఇహ ఇప్పుడు కూడా ప్రశాంత ప్రదేశం దొరక్కపోతే
ప్రతి ఒక్కరికీ తప్పవు కష్టాలు. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా ఎదురవుతాయి కష్టాలు జాగ్రత్త అని హెచ్చరించారు.
ఇంకో మాట శెలవిచ్చారు.
ప్రపంచపు తాళం చెవి ప్రభువు చేతుల్లో వుంది.
ఆ చేతులపైనే మేకులు కొట్టారు శిలవపై అని చారిత్రక సత్యాన్ని చెప్పారు.
ఆ సంఘటనకి, బువా సాహెబ్ తప్పిదానికి సంబంధం వుందా!
ఇంకేదయినా సంఘటనకి సంకేతమా ఇది. ఇవి అప్పటి శేష ప్రశ్నలు.
వెరసోవా నౌకపై బాబావారి గురించి ఎవరికి తెలీదు, ఏదో ఒకరిద్దరికి తప్ప. **అంటే బాబావారిని ఎవరూ గుర్తుపట్టలేరు.**

**మరి అలా అని బాబా డెక్‌పై కనబడగానే అందరి దృష్టి బాబావారి పైనే.**
**దైవత్వం పుట్టిపడుతున్న ఈయన ఎవరబ్బా అంటూ తేరిపార చూసేవారు.**
**కొందరయితే బాబావారినే చూస్తూ నిలబడిపోయేవారు.**
ఇంజన్ గదిలో పనిచేస్తున్న ఓ వ్యక్తి బాబావారు కనిపించగానే ఓ మూలకి ఒరిగి నిలబడేవాడు. ఏదో చెప్పాలన్న తపన కనబడేది అతనిలో.
అయినా పెదవి కదిపేవాడు కాదు.
ఎప్పుడూ మౌనంగా నిలబడి బాబా వారి వంక చూస్తూ వుండేవాడు.
మరి బాబావారు అతన్ని పట్టించుకొన్నారన్న దాఖలా లేదు.
ఇలా ఐదు రోజులు గడిచాయి. ఆరవ రోజు బాబావారే పిలిచారు అతన్ని.
నీ పిలుపు కోసమే ఎదురు చూస్తున్నా స్వామి అంటూ,
అతగాడు వెంటనే బాబావారి సముఖంలో హాజరయ్యాడు.
బాబావారు తమ చేతి రుమాలుని బహుకరించారు.
ఆనందం పట్టలేకపోయాడతను. ఆనందంతో కళ్ళు చెమర్చాయి.
అమూల్యమైన బహుమానం ఇది నాకు అంటూ ఆ రుమాలుని కళ్ళకి అద్దుకొన్నాడు.
ముద్దు పెట్టుకున్నాడు. ఇంతకీ ఇతగాడు ఎవరో!
పేరు తెలియదు కానీ అతనొక ముస్లిమ్ అని మాత్రమే చరిత్ర పుటల్లో వ్రాశారు.
నౌకలో పన్జేస్తున్న వ్యక్తి ఛాన్జీని నిలదీశాడు.
ఒకరోజు ఎవరు ఈయన అని బాబావారి వైనం అడిగారు.
అతగాడు ప్రయాణికుల అవసరాలని గమనించే ఉద్యోగి.
కాబట్టి అందరూ అతన్ని గౌరవంగా చూస్తారు.
ఉద్యోగ హోదా రీత్యా అతన్ని స్టీవార్డ్ అంటారు.
గోవా నివాసి. కాథలిక్ మతస్థుడు. ఛాన్జీ అతని మాటలు విన్నాడు.
కానీ పెదవి విప్పలేదు. మన మిత్రుడు వదిలి పెట్టలేదు.
చూస్తుంటే ఏసు ప్రభువు తిరిగి వచ్చారా అనిపిస్తుంది. ఎవరాయన?
మీకేమి అవుతాడు. మీ గురువుగారా ఆయన.
వారు సద్గురువు కారు కదా?
ఇలా ప్రశ్నల వర్షం కురిపించాడు. ఛాన్జీ నిదానంగా బదులు పలికాడు.
ఆయన ఎవరో కాదు, మా స్నేహితుడే అన్నాడు.
ఇలాంటివే ఎన్నో సంఘటనలు జరిగాయి.
సరే, సెప్టెంబరు 26వ తేదీన వెరసోవా నౌక మహమ్మెరా చేరింది.
ఈ ఊరినే ఖుర్రమ్ షహర్ అని కూడా పిలుస్తారు.

**– సశేషం**

# అవతారుడు తోడుండగా....,



దాదాఛాంజీని టోకా ఆశ్రమం దగ్గర నదిలో కాలుజారి మునిగిపోతుంటే బాబా తన చేతినందించి రక్షించారని ఈ సంచికలోనే పేజి 30లో చదువుకున్నాం. బాబా తన ప్రేమికుల్ని అనేక విధాలుగా తోడుగావున్న విషయాలు అనేక సందర్భాలలో మనం తెలుసుకున్నాం. కాగా, ఈ సంఘటన ఇటీవల 2015 మే చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగింది. జూబ్లీ బాబా సెంటర్ సుమారు ఎకరం విస్తీర్ణంలో వుంది. బాబావారి ప్రార్థనా హాలుకు చుట్టూతా గల సుమారు ఎకరంపైగా గల భూమిలో అనేక మొక్కలు - చెట్లు పెంచుతున్నారు. ఆ మొక్కలకు నీరు, పరిశుభ్రత అంతా ప్రతివారం శెలవు రోజుల్లో బాబా ప్రేమికులు ముఖ్యంగా యువతరం ఎక్కువగా జట్లుగా హాజరవుతారు. జూబ్లీ సెంటర్ కార్యదర్శి రాజేంద్ర మెహెర్ ఈ యువ బృందానికి నాయకునిగా నడిపిస్తూ, తానూ అక్కడి పనుల్లో పాల్గొంటాడు. ఇది సర్వ సాధారణంగా జూబ్లీ సెంటర్‌లో చాలాకాలంగా జరుగుతున్నది. ఐతే, మే చివరి వారంలో ఏమైందంటే, యువతరం ప్రేమికులు ఓ డజను మంది పైగా వారికి అప్పగించిన పనులు చేసుకుంటున్నారు. రాజేంద్ర మెహెర్ మోటారు పంపుసెట్‌ను నొకదాన్ని అది వున్న చోట నుంచి మరో చోటకు చేతిలో ఎత్తుకుని తరలించబోయాడు. ఆ మోటారుకు కరెంటు వైర్లున్న సంగతి రాజేంద్ర మెహెర్ గమనించ లేదు. మోటారు స్విచ్ ఆన్‌లోనే వుంది. చిన్నపాటి కరెంటు వైరు తగిలితేనే ఒళ్ళంతా షాక్ కొడ్తుంది. అలాంటిది 250 volts సామర్థ్యం గల కరెంటు మోటారును చేతితో ఎత్తుకోబోతే, ఎంతటి షాక్ తగిలి వుంటుందో పాఠకులు ఊహించగలరు!! సాధారణంగా అలాంటి సమయంలో శరీరంలో ప్రవహించే రక్తం గడ్డ కట్టి, రక్తం పొడిగా మారి శరీరం నిర్జీవమవుతుందని డాక్టర్లు చెప్తారు. షాక్ తగిలిన వ్యక్తి, ఒక్క ఉదుటున నేలపైకి విసిరివేయబడతాడు. కరెంటు షాక్ తగిలిన సమయంలో రాజేంద్ర మెహెర్‌కు ఇవన్నీ తెలుస్తూనే వున్నాయి. ప్రాణం శరీరాన్ని వదిలిపెడుతున్న స్ఫురణ తనకుందని రాజేంద్ర మెహెర్ అన్నారు. **ఆ తర్వాత అచేతనంగా నేలపై పడిపోయిన** రాజేంద్ర మెహెర్‌కు బాబా యువత first aid - artificial respiration తదితర సేవలు అందించారు. ఈ గొప్ప షాక్ నుంచి తేరుకున్న రాజేంద్ర మెహెర్, ఇదంతా అవతారుని లీల అని, బాబాకు రెండు చేతులూ జోడించాడు. **జైబాబా.**

# హిందీ సహవాస్

(1955 నవంబరు 19 నుండి 24)

నవంబర్ 19 మధ్యాహ్ననికల్లా హిందీ ప్రాంతంలో వుండే బాబా ప్రేమికులు అహ్మద్‌నగర్‌కు చేరుకున్నారు. అవతార్ మెహెర్‌బాబాకి జై అంటూ జయజయ ధ్వానాలు మిన్నంటాయి. ఉత్తరాదిలోని హమీర్‌పూర్, కాన్పూర్, ఆలీఘర్, ఢిల్లీ, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల నుండి ప్రేమికులు మొత్తం 164 మంది ఈ సహవాస్‌లో పాల్గొన్నారు. ఆ మర్నాడు అంటే నవంబర్ 20 ఆదివారం నాడు ఉదయాన్నే మెహెర్‌బాబా 7.15 కల్లా మెహెరాబాద్‌కు వచ్చారు.

బాబా ప్రేమికులు ఒక్కొక్కరే బాబాకు పూల దండలు వేశారు.

ఢిల్లీ బాబా ప్రేమికుడు, నిరంజన్ సింగ్, ఆయన స్థానిక కళాశాల ప్రిన్సిపాల్. ఆయన పూల దండ తేలేకపోయానేనని బాధపడుతున్న సమయంలో బాబా అది గమనించి తన మెడలోని ఒక పూల దండను తీసి నిరంజన్ సింగ్‌కి ఇచ్చి తిరిగి తన మెడలో వేయించుకున్నారు.

ఆంధ్ర ప్రేమికులు మాదిరి కాకుండా ఉత్తరాదివారు ఒక్కొక్కరే క్యూలో వచ్చి బాబాకు నమస్కరించి పూల దండలు సమర్పించారు. తెలుగువారు బాబా యెడల వారి ప్రేమను చూపడంలో వారు చూపే విధానం భిన్నంగా వుంటుంది.

తెలుగువారు పూల దండ వేసి ప్రణమిల్లడమే కాకుండా బాబాను ఊపిరాడనంత రీతిలో ఆలింగనం చేసుకోవాలని ఉవ్విళ్ళూరేవారు.

కొంతమందైతే, తనను గట్టిగా ఆలింగనం చేసుకోవడంతో ఉక్కిరిబిక్కిరయ్యేవాడినని బాబా అన్నారు. అయితే హిందీ గ్రూపు ప్రశాంతంగా ఒక్కొక్కరే క్యూలో వచ్చి పూల దండలు వేయడం తనకెంతో ఆనందంగా వుందన్నారు బాబా. నౌరంగా నుంచి వచ్చిన బాబా ప్రేమికుడు హీరాలాల్ బాబా పాదాలు ప్రణమిల్లుదామనుకుని కూడా బాబావారి ఈ మాటలతో తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. కొందరు దూరంగా నిలుచుని చెమ్మగిల్లిన కళ్ళతో బాబాకు ప్రణమిల్లారు. ఆ తర్వాత బాబా ఒక్కొక్కరినే దగ్గరకు తీసుకొని వారితో చమత్కారంగా అనేక విషయాలు మాట్లాడారు.

హమీర్‌పూర్ నుండి వచ్చిన పుకార్‌జీతో మాట్లాడుతూ

ఓ! నీవు గడ్డం గీయలేదా! రాత్రి ఎన్ని పూరీలు తిన్నావ్? అని అడిగారు.

బాబా! నేను జలుబుతో రాత్రంతా బాధపడ్డాను.

అందువల్ల ఓ 15 పూరీలు మించి తినలేకపోయానని అన్నాడు.

బాబా నవ్వుతూ 15 పూరీలేనా? అని అంటూ జలుబు అంటువ్యాధి లాంటిది.
నాకు అంటించేవ్! అని చమత్కరించారు.
డా॥ దౌలత్ సింగ్ బాబాను కన్నార్పకుండా చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నాడు.
అతని తలను బాబా ప్రేమతో తన ఒడిలో ఉంచుకున్నారు.
ఆ తర్వాత బాబా మాట్లాడుతూ రేపట్నుండి పూల దండలు తీసుకురావద్దన్నారు.
అనవసర ఖర్చు చేయవద్దన్నారు.
అప్పటిదాకా బాబా మెడలో వేసిన పూల దండలను ఒక్కొక్కటీ తీసి ప్రక్కన పెట్టారు.
సహవాస్ జరుగుతున్న సమావేశ హాలు బయట ఉన్న నోటీసు బోర్డులో వుంచిన నియమావళిని అందరూ చదివారా? అని బాబా అడిగారు.
మనందరం ఒక కుటుంబ సభ్యుల మాదిరిగా ఈ సహవాస్‌లో పాల్గొందాం.
హాయిగా, ప్రశాంతంగా, సుఖవంతంగా మీ ఇంట్లో వున్నమాదిరిగా ఎలాంటి అరమరికలూ లేకుండా వుండండి. మీ కష్టాలు ఇంటి దగ్గర వున్న సమస్యలు ఇతరత్రా అన్నీ నా సమక్షంలో వున్నప్పుడు మర్చిపోండి అన్నారు.
ఇక్కడదాకా వచ్చి ఇక్కడ నా సమక్షంలో వుంటూ మీ భార్యా పిల్లల గురించి ఆలోచన చేస్తే మీరు నా సహవాస్‌కు వచ్చినట్లు కాదన్నారు.
నా ఎదుట రెండు చేతులతో నమస్కరిస్తూ మనస్సులో మీ భార్యా పిల్లలను తలచుకుంటే ఆ నమస్కారం వారికే చెందుతుందన్నారు.
సాధారణంగా తెలుగు వారికి ఇక్కడి వాతావరణం సరిపోదు.
దానివల్ల వారిలో చాలామంది అస్వస్థతకు గురయ్యారు.
అయినప్పటికీ వారు ఈ సహవాస్‌లో చక్కగా పాల్గొని అమితానందాన్ని అనుభవించారు.
మీలో కూడా చిన్నపాటి అనారోగ్యం వున్నా తగిన వైద్యం తప్పక తీసుకోండి.
అలోపతి కావల్సినవారు డా॥ నీలూని సంప్రదించమన్నారు.
అలాగే హోమియోపతిని ఇష్టపడేవారు డా॥ పాద్రీ దగ్గరకు వెళ్ళమన్నారు.
ప్రేమతో బాధపడేవారికి తానే పెద్ద వైద్యుడినని బాబా చమత్కరించారు.
గుజరాతీ సహవాస్ సమయంలో వారికి ప్రేమ, విధేయత, నా నామవ్యాప్తి గురించి వివరించాను. తెలుగు సహవాస్‌లో కూడా ఇదే విషయాలని మరో కోణంలో వివరించాను. బాగా చదువుకోనివాళ్ళున్నా ఫరవాలేదు.
శ్రద్ధగా నా మాటలు వింటే వారికి ఈ విషయాలు చక్కగా బోధపడతాయన్నారు.
నిన్న సాయంత్రం ఏరుచ్‌తో మాట్లాడుతూ మరో విషయాన్ని ప్రస్తావించానన్నారు.
నేను చెప్పేది శ్రద్ధగా వినండన్నారు. నిద్ర మత్తుగా వుంటే హాయిగా బయటకు వెళ్ళి బెంచీల మీద కూర్చోమన్నారు. నా ఎదుట కూర్చునవాళ్ళు
నేను చెప్తున్నదాన్ని శ్రద్ధగా ఆలకించమన్నారు.

నిన్న రాత్రి నిద్రపట్టని వాళ్ళు ఎవరైనా వుంటే లేచి నిల్చోమన్నారు.
ఆ మాటకి చాలామంది లేచి నిల్చున్నారు.
ఒక్కొక్కరు ఒక్కొక్క కారణం చెప్పారు.
ఒకరు జలుబని, మరొకరు జ్వరమని ఇలా వారి అస్వస్థతలను ఏకరువు పెట్టారు.
అయితే ఎవరూ కూడా నా నామం నిరంతరం తలుచుకుంటూ వుండటం వల్ల రాత్రంతా మెలకువుగా వున్నామని చెప్పలేదని బాబా హాస్యంగా నవ్వించారు.
ఏమీ **నా భాగ్యం** అని పకపకా నవ్వారు.
ప్రేమ గురించి బాబా ఇలా అన్నారు. ప్రేమ గురించి నేను ఎంత చెప్పినా, మరెంత వివరించినా అది సంపూర్ణంగా అందరికీ అర్ధం కాదన్నారు.
అది మీరు వినడంలో లోపం కాదన్నారు. పుస్తకాలలో చదివితే ప్రేమ అర్ధం కాదన్నారు.
అయినప్పటికీ ప్రేమ గురించి నేను చెప్తానన్నారు.
**బాబా నీ ప్రేమ కావాలి!!** అని నన్ను చాలామంది అడుగుతారు.
మీరు నన్ను అధికాధికంగా, ఇంకనూ అధికంగా నన్ను ప్రేమించమని చెప్తుంటాను.
అయితే ప్రేమ గురించి కొన్ని సంశయాలను నేను విడమర్చి చెప్పే ప్రయత్నం చేస్తాను.
హాఫీజ్ ఏమంటాడంటే **ప్రేమకీ –మానవ మేధస్సుకీ**
భూమికీ – ఆకాశానికి వున్నంత తేడా వుందన్నాడు.
మానవ మేధస్సుతో ప్రేమని అర్ధం చేసుకోలేమన్నారు.
ఆ మేదస్సుని పక్కనపెడితే ప్రేమ గురించి తెలుస్తుందన్నారు.
దీని కోసం హృదయం పరిశుద్ధంగా వుండాలన్నారు.
ఒకరు అద్భుతమైన మేధావి. మరొకరు గొప్ప అమాయక చక్రవర్తి అనుకుందాం.
అయితే వీరిద్దరికీ కూడా భగవంతుని ప్రేమ లభిస్తుంది.
ఎప్పుడైతే వారి హృదయాలు పరిశుద్ధంగా భగవంతుడిని ఆహ్వానించేందుకు సిద్ధంగా వుంటాయో, ఆనాడు వారి మేధస్సుతో సంబంధం లేకుండా దైవీ ప్రేమ తప్పక లభిస్తుందని బాబా అన్నారు. ఈ వివరణ సమయంలో బాబా ఏమన్నారంటే,
నేను ఈ విషయాల్ని తెలుగు, గుజరాతీ సహవాస్‌లలో చెప్పలేదన్నారు.
ఆధ్యాత్మికత – ప్రేమ – భగవంతుని గురించి, నేనెంతగా చెప్పినా
మీరు ఆ విషయాలను అర్ధం చేసుకోవడం కాదు ప్రధానం,
మీరు అనుభవించగల్గాలని బాబా అన్నారు.
నేను చెప్తున్నప్పుడు మీరా విషయాలను అర్ధంచేసుకోగల్గుతారు.
కానీ అనుభవంలో వుండదు. భగవద్వచనం – గాడ్ స్పీక్స్ గ్రంథాన్ని
మీరు ఆసాంతం చదివితే పుస్తకంలోని ప్రతి అక్షరం మీకు బోధపడవచ్చు.
కానీ భగవంతుని ప్రేమించడం, భగవంతుని ప్రేమ, రెండూ భిన్నమైనవి.

భగవంతుని గురించి వివరంగా,
అలాగే భగవంతున్ని ఎలా ప్రేమించాలి? అనే విషయాల్ని భగవద్వచనం
స్పష్టంగా చెప్తుంది. గాడ్ స్పీక్స్ గురించి బాబా మరింత మాట్లాడుతూ
సహవాసీలలో ఒకరైన నిరంజన్‌షాను ఉద్దేశించి బాబా ఇలా అన్నారు.
నిరంజన్‌షా గాడ్ స్పీక్స్‌ని చదివి, అర్థం చేసుకొని చాలా బాగుందని ఆనందిస్తే
నేను తృప్తిచెందనన్నారు. ఆ పుస్తకం చదివిన నిరంజన్‌షా
నన్ను ప్రేమించవల్సిన రీతిలో ప్రేమించడం ప్రారంభిస్తే నేను సంతోషిస్తానన్నారు.
సావధానంగా ఆలకించండని హెచ్చరించారు. మీకు అర్థం కాకపోతే బాధపడొద్దన్నారు.
నేను చెప్పింది విన్నతరువాత నన్ను ఎలా ప్రేమించాలో, నన్ను ప్రేమించే విధానంపై
కొంత అవగాహన కలగొచ్చన్నారు.
ఆధ్యాత్మిక పథంలో ఉండటం అంత ఆషామాషీ విషయం కాదన్నారు.
మనసా వాచా కర్మణ ఎవరైతే పరిశుద్ధంగా వుండగల్గుతారో వారే ఈ పథంలో ముందుకు
పయనించగల్గుతారన్నారు.
ఆధ్యాత్మికత గురించి కొన్ని వందల వేల పుటలలో గ్రంధస్తం చేశారు.
భగవంతుని పాదాల చెంత ధూళిగా మారాలన్నారు.
ఈ విషయంపై మరింత వివరణ ఇస్తానన్నారు.
ఆ దరిమిలా ప్రేమ గురించి మాట్లాడతానన్నారు.
ఈ క్రింది మూడు విషయాలు అప్రస్తుతం, అప్రధానం అని బాబా అన్నారు.
ఆ మూడు ఏమంటే 1) నాకు పూల దండలు వేయటం,
2) నన్ను ఆరాధించడం,
3) పూజించడం, హారతులివ్వడం అని అన్నారు.
ఇవన్నీ భగవంతుడిని ప్రేమించడానికి చిహ్నాలు కావు అని అన్నారు.
ఆధ్యాత్మిక పథంలో ప్రముఖంగా గుర్తుంచుకోవల్సినవి మూడు విషయాలున్నాయన్నారు.
ఇందులో ఎలాంటి రాజీ లేదన్నారు.
అవేమంటే 1) ప్రేమ, 2) వినయం, 3) విధేయత.
భగవంతున్ని ప్రేమించడం గొప్ప విషయమే.
కానీ భగవంతున్ని ప్రేమించడం కన్నా గొప్ప విషయం
భగవంతుని ఎడల వినయంగా వుండటం.
వినయం కన్నా గొప్పది దేవునికి సంపూర్ణంగా విధేయతతో వుండటం అత్యంత ప్రధానం,
గొప్ప విషయం అని బాబా అన్నారు.
ప్రేమ భగవంతుని కోసం ప్రయత్నిస్తుంది. .......
2) వినయం భగవంతుని కోరికను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుంది.

3) విధేయతతో ప్రేమికుడు భగవంతుని ఇచ్ఛకు కట్టుబడి వుంటాడు.
1) ఎవరైతే భగవంతున్ని ప్రేమిస్తారో వారు కేవలం భగవత్ ప్రేమికులుగా మిగులుతారు.
2) భగవంతుని ఎడల వినయంగా వున్నవారు భగవత్ సేవకులవుతారు.
3) ఎవరైతే తనువు, మనస్సు, సర్వస్వాన్ని భగవంతునికి అర్పిస్తారో వారికి ఆ దేవదేవుడు తప్పించి, ఈ ప్రపంచంలో మరెవ్వరితో సంబంధం వుండదు.
ప్రేమ అనేది భగవంతుడి నుండి మనుష్యునికి లభించిన బహుమతి.
సద్గురువు ఇలాంటి బహుమతిని తన శిష్యులకు అందజేయలేడు.
వినయం అన్నది గురువు నుండి శిష్యునికి లభించిన బహుమతి.
విధేయత అన్నది మానవుడు భగవంతునికిచ్చే కానుక అని బాబా అన్నారు.
ఈ సందేశం తర్వాత ఓ 20 నిముషాలు విశ్రాంతి తీసుకుని రమ్మన్నారు.
మండలి హాలు వరండాలో బాబా అటూ-ఇటూ పచార్లు చేస్తున్నారు.
ఇంతలో రాంహీర్‌దయా తివారీ, పి.యం. భట్ (నాగపూర్) వచ్చి బాబా ప్రక్కన నిల్చున్నారు. బాబా వారిద్దరికీ ఆలింగనం ఇచ్చారు.
తివారీ కళ్ళంబడి నీళ్ళతో ఏడుస్తూ ఉన్నాడు.
తన మనమడు ఇటీవలనే చనిపోయినాడని బాబాతో చెప్పాడు.
తివారీ అంతక్రితం రోజులలో జాల్ కేరేవాలా దగ్గర పనిచేశాడు.
జాల్ కేరేవాలా ప్రభుత్వ ఉన్నత ఉద్యోగిగా పన్జేశాడు.
తివారీతో మాట్లాడుతూ జాల్ కేరేవాలా కూడా చనిపోయాడు కదా అని బాబా గుర్తుచేశారు. పి.యం. భట్ మాటల్లో కలుగజేసుకొని తివారీకి డైరెక్టర్‌గా ప్రమోషన్ వచ్చిందని చెప్పాడు. దాంతో తివారీ ముఖం నవ్వుతో విప్పారింది.
అది చూసిన బాబా ఒక చెంప దు:ఖం
మరోవైపు ఆనందం.
డోంట్‌వర్రీ నేనున్నానని -బాబా బరోసా ఇచ్చారు.
హిందీ గ్రూపు విశ్రాంతి ముగించుకుని తిరిగి సమావేశ హాలులో హాజరయ్యారు.
నిరంజన్ సింగ్‌ని వచ్చి తన ప్రక్కన కూర్చోమన్నారు.
నీవు దూరంగా, గోడకు వీపు ఆన్చుకుని కూర్చుంటే
నిద్రతో తూగుతున్నావని బాబా చమత్కరించారు.
జలుబు, దగ్గులు వుంటే నాకు భయం అన్నారు బాబా.
ఎందుకంటే, అవి అందరికీ అంటుకుంటాయని నాకు భయం అన్నారు.
జలుబు, దగ్గు తనకు సోకకుండా దీవించమని బాబా కైకోబాద్‌ను కోరారు.
అనంతరం, మండలి హాలులో సహవాస్ కార్యక్రమం ప్రారంభమైంది.

**-సశేషం**

# దాదాఛాంజీ



**ఫ్రమ్‌రోజ్ హెచ్ దాదాఛాంజీ** తొలిసారిగా 1924 ప్రాంతంలో మెహెరాబాద్ ఆశ్రమంలో చేరాడు. ఈయన్ని బాబా **ఛాంజీ** అని ప్రేమగా పిలిచేవారు. **ఛాంజీ** మెహెర్‌బాబాకు ప్రప్రధమ కార్యదర్శిగా పనిచేశాడు. మెహెర్‌బాబాతో కల్సి మనదేశంలో అనేక ప్రాంతాల్లో, అలాగే, విదేశీ పర్యటనలలో ఛాంజీ పాల్గొన్నాడు. బాబావారి కార్యదర్శిగా ప్రతిరోజూ బాబా దినచర్య, ఆయన ఇచ్చిన అనేక ఆధ్యాత్మిక సందేశాలను తన డైరీలో రాసుకునేవాడు. మెహెర్‌బాబా కాశ్మీర్ పర్యటనలో వుండగా 1944 ఆగస్టు 25న, 52 సంవత్సరాల వయస్సులో తుదిశ్వాస వదిలి అవతారునిలో ఐక్యమయ్యాడు. సుమారు రెండు దశాబ్దాలు బాబా వెన్నంటి వుండి బాబావారి అనేక ఆధ్యాత్మిక సందేశాలను తన డైరీలలో నిక్షిప్తం చేశాడు. 1924-1944 నడుమ అవతారుని జీవనంలోని ప్రతి క్షణాన్ని తన డైరీలలో ఛాంజీ రికార్డు చేశాడు. ఛాంజీ డైరీల ఆధారంగానే నేడు అవతారుని ప్రేమికులకు విశేష సమాచారం అందుబాటులో లభిస్తోంది. తొలితరం బాబా ప్రేమికుడు ఫ్రమ్‌రోజ్ హెచ్ దాదాఛాంజీ గురించి ఈ తరం బాబా ప్రేమికులు తప్పక తెలుసుకోవాలి.

తన ప్రేమికుల కోసం భగవంతుడు ఎలా నిరీక్షిస్తాడో,
తన ప్రేమికులను బాబా ఎలా వెదికి పట్టుకుంటాడో
దాదాఛాంజీ గురించి తెలుసుకుంటే పాఠకులకు అర్థమౌతుంది.
ఇకపై దాదాఛాంజీ గురించి సంక్షిప్తంగా, సమగ్ర సమాచారం
అందించే ప్రయత్నం చేస్తున్నాం.
దయచేసి పరిశీలించండి.

***

ఛాంజీ 1892 నవంబర్ 23న ముంబాయిలో జన్మించాడు.
ముంబాయిలోని పార్శీ స్కూలులో చదువుకున్నాడు.
కరాచీలో కళాశాల విద్య అభ్యసించాడు. ఆ తర్వాత షార్ట్‌హాండ్, టైపింగ్ నేర్చుకున్నాడు.

చదువు అయిపోయాక ముంబాయిలో గ్రీవ్జ్ కాటన్ కంపెనీలో పన్జేశాడు.
నాలుగేళ్ళ తర్వాత మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్నలిస్టుగా పన్జేశాడు.
యుద్ధం ముగిశాక ముంబాయిలో వున్న పలు ప్రైవేటు కంపెనీలలో అనేక రకాలైన చిన్నాచితకా ఉద్యోగాలు చేశాడు.
ఫ్రమ్‌రోజ్ హెచ్ దాదాఛాంజీ గురించి డిసెంబరు 25, 1916 నుండి తెలుసుకోవాలి.
ఆ రోజున ఆయన వివాహమైన రోజు.
అప్పటికి ఆయన వయస్సు 23 సంవత్సరాలు.
ఆయన తన అందమైన భార్యను అమితంగా ప్రేమించేవాడు.
అయినప్పటికీ కొన్ని అనివార్య పరిస్థితులవల్ల పెళ్ళైన కొన్ని సంవత్సరాలకే భార్యతో విడాకులు కోరి తీసుకున్నాడు.
ఆ రోజుల్లో విడాకులనే పదం చాలా అరుదుగా వినపడేది.
గౌరవప్రదంగా గుట్టుగా గడిపే మధ్యతరగతివారు
ఆ పదాన్ని ఉచ్ఛరించడాన్నే అగౌరవంగా భావించే రోజులవి.
ఏమైనప్పటికీ దాదా ఛాంజీ 1920 నాటికి తన భార్యతో విడాకులు తీసుకొని పవిత్ర వివాహబంధాన్ని అన్యమనస్కంగానే తెగతెంపులు చేసుకున్నాడు.
దాదా ఛాంజీ ముంబాయిలోని గ్లోబల్ సినిమా థియేటర్‌లో పనిచేస్తుండేవాడు.
ఆ దరిమిలా తన స్నేహితుని భాగస్వామ్యంతో మెడలీన్ సినిమా హాల్‌కు ప్రొప్రయిటర్‌య్యాడు. మెడలీన్‌లో మంచి భక్తిరస సినిమాలు ప్రదర్శించేవారు.
సినిమా హాలు ఎప్పుడూ ప్రేక్షకులతో నిండుగా, హౌస్‌ఫుల్‌గా వుండేది.
ఐనా, తన భాగస్వామి తెలివితేటలవల్ల సినిమా హాలు ఎప్పుడూ నష్టాల్లోనే వుండేది.
ఛాంజీ తన వ్యాపార భాగస్వామిని బాగా నమ్మాడు.
అందుకు ప్రతిఫలంగా అతగాడు నిలువునా ముంచి అప్పులు చేతికిచ్చాడు.
అంతేకాదు, తన భార్యను నమ్మించి, మాయమాటలతో ప్రలోభపరిచి ఆమెను వశపరచుకున్నాడు. ఫలితంగానే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వుండేందుకై ఆమెతో విడాకులు తీసుకున్నాడు.
ఆ దరిమిలా సినిమా హాలు మూసేశారు.
చేసిన అప్పులు తీర్చడానికి తన స్నేహితుడి దగ్గర భారీగా అప్పు చేశాడు.
అప్పటిదాకా ఛాంజీకి ఒక నిజాయితీపరునిగా మంచి పేరుంది.
కానీ, తీసుకున్న అప్పు సమయానికి తీర్చకపోయేసరికి అప్పిచ్చిన స్నేహితుడు అనరాని మాటలన్నాడు. డబ్బులు వుండీ అప్పు తీర్చడంలేదన్నాడు.
కావాలనే అప్పు తీర్చకుండా తనని ఇబ్బంది పెడుతున్నాడని నిందించాడు.
ఓ చెంప భార్యతో విడాకులు, మరోవైపు అప్పుల బాధ.

మానసికంగా, భౌతికంగా సతమతమౌతూ, ఆత్మహత్యే శరణ్యమని నిర్ణయించుకున్నాడు.
ఒకరోజున దిగులుతో...ఒంటరిగా ముంబాయిలోని చౌపతీ బీచ్‌లో దూరంగా,
నిర్జల ప్రదేశంలో, జనసంచారం లేని చోట ఛాంజీ కూర్చున్నాడు.
కాస్త చీకటి పడ్డాక సముద్రంలో దుమికి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

***

అదే రోజున మెహెర్‌బాబా కొంతమంది మండలివారితో కలిసి ముంబాయి వచ్చారు.
అలా ముంబాయికి వచ్చిన మెహెర్‌బాబా,
ఆ రోజు సాయంత్రం నావల్ తలాతీతో కల్సి యథాలాపంగా చౌపతీ బీచ్‌కి వచ్చారు.
సముద్రతీరాన అటూ ఇటూ పచార్లు చేస్తూ,
దూరంగా, ఒంటరిగా, దిగులుగా కూర్చుని వున్న ఛాంజీ దగ్గరకు వచ్చారు.
అలా దగ్గరగా వెళ్ళితే, అతనెవరో కాదు,
నావల్ తలాతీకి చిన్ననాటి స్నేహితుడు **ఛాంజీ** అని గుర్తించాడు.
మెహెర్‌బాబాను, నావల్‌ను చూసిన ఛాంజీ....
**మీకేం కావాలని?** అడిగాడు.
తన ఏకాంతాన్ని డిస్టర్బు చేసినట్లు ఛాంజీ భావించాడు.
బాబా నవ్వుతూ, "మాకేం కావాలి!! మా కేమీ అక్కర్లేదని జవాబిచ్చారు!!"
తన విషయాలను గుంభనంగా ఉంచుకునే ఛాంజీ,
నన్నెందుకు హాయిగా, ఒంటరిగా ఉండనీయకుండా,
మీరిక్కడకు వచ్చారని, తిరిగి బాబాతో అన్నాడు.
నీకు త్వరలో అనంతమైన ఆనందం, దైవీ కృప లభించనుంది.
అది తెలియజెప్పడానికే, నేను ఇక్కడికి వచ్చానని, బాబా అన్నారు.
ఆనందమా? నా జీవితంలో ఆనందం, సంతోషం అనే మాటలకు అర్థం లేదన్నాడు.
నేను అంత అదృష్టవంతుడ్ని కాదు.
నా ఆనందం, అదృష్టం అన్నీ ఏనాడో నన్ను వదిలి వెళ్ళిపోయాయి, అని
ఛాంజీ అన్నాడు. నీకు నిజమైన ఆనందం త్వరలో లభిస్తుంది.
నువ్వు ఇంతవరకు ఆనందం అనుకున్నది,
అది అసలైన ఆనందమే కాదన్నారు బాబా.
త్వరలో నీకు భగవంతుని కృప లభిస్తుంది.
దాంతో నీకు నిజమైన ఆనందం దొరుకుతుంది.
కాబట్టి దిగులుపడొద్దు,
దేనికీ దు:ఖించొద్దు అని బాబా జోస్యం చెప్పారు.

ఈ మాటలు విన్న ఛాంజీ ఆశ్చర్యపడ్డాడు.
తనను తానే నమ్మలేకపోయాడు.
తన మనస్సులోని దిగులు ఇతనికి ఎలా తెలిసిందా? అని ఆశ్చర్యపడ్డాడు.
బాబాకేసి చూస్తూ, ఇంతకీ నీవెవరని అడిగాడు.
బాబా చిరునవ్వులు చిందించారు.
బాబావారి చిరునవ్వే, ఆతని జీవితంలో మరువరాని మలుపు తిరిగింది.
అతను బాబాకేసి చూసినప్పుడే
హృదయంలోని వేదన తగ్గినట్లు భావించాడు.
తన హృదయం తేలికైనట్లు భావించాడు.
నావల్ తలాతీ మెహెర్‌బాబా గురించి
ఛాంజీకి క్లుప్తంగా పరిచయం చేశాడు.
బాబా ఛాంజీకేసి చూస్తూ, నేను చూపించే సినిమాలో నీకు ప్రముఖ పాత్ర వుందన్నారు.
నాకు సినిమా హాలు కూడా వుందని, ఛాంజీ బాబాతో అన్నాడు.
బాబా నవ్వుతూ నువ్వు చెప్పే సినిమా వేరు.
నేను చెప్తున్నది ఈ ప్రపంచమనే మహా చలనచిత్రంలో
నీకు ప్రధాన పాత్ర వుంటుందన్నారు.
నీవు నా దగ్గరకు వచ్చినప్పుడు
అదేమిటో నీకు అర్థమౌతుందన్నారు.
ఇంతకీ నేను చెప్పేదేమంటే
నీ అదృష్టం త్వరలోనే నీ ఇంటి తలుపు తడుతుంది.
నీవిక దేని గురించీ దిగులు చెందొద్దు, అని బాబా అభయమిచ్చారు.
ఆ తర్వాత బాబావారు వుంటున్న అడ్రస్సు నావల్ తలాతీ ఛాంజీకి ఇచ్చాడు.
అది చూస్తూనే ఛాంజీలో కొత్త ఆశలు చిగురించాయి.
ఆత్మహత్య చేసుకుందామనుకున్న ఆలోచనలు అతనిలో మటుమాయమయ్యాయి.
దాదర్ దగ్గర భరూబా భవనంలో బస చేశారు.
ఛాంజీని ఆ మర్నాడు అక్కడకు వచ్చి కలవమన్నారు.
నోట మాటలు రాని ఛాంజీ సరేనని తల వూపాడు.
ఛాంజీ మనస్సు దూదిపింజలా తేలియాడింది.
మనస్సులో దిగులు సగం మాయమైనట్లుంది.
తనకి తెలియకుండానే బాబా వైపు ఛాంజీ మనస్సు లాగినట్లయింది.
ఆ మర్నాడు బాబా కూడా..
ఛాంజీ వచ్చేదాకా వేచి వుండకుండా,

ఛాంజీని వెంట తీసుకురమ్మనమని నావల్ తలాతీని పంపారు.
భగవంతుడు తన భక్తుడిని అలాగే వెదుక్కుంటూ వెళ్తాడనిపిస్తుంది.
1925 జూలై 10 నుండి మెహెర్‌బాబా మౌనంలో వున్నారన్న
సంగతి పాఠకులకు తెలుసు. ఐతే, ఈ సంఘటన నాటికి బాబా మౌనం చేపట్ట లేదు.
అప్పటికి బాబా మాట్లాడుతున్నారు.
ఆ మర్నాడు బాబావారి ఆశ్రమానికి వెళ్ళిన ఛాంజీని,
నీవు ఏమయినా చెప్పదల్సింది వుందా? అని బాబా అడిగారు.
దాంతో పట్టలేనంత దు:ఖంతో దిగమింగుకుని వున్న ఛాంజీ,
బాబా ఎదుట వున్నదున్నట్లుగా తన బాధనంతా చెప్పుకున్నాడు.
ఛాంజీ కష్టాలు విన్న బాబా
అతడ్ని ప్రేమతో తన అక్కున చేర్చుకున్నారు.
బాబా ప్రేమను చవి చూసిన ఛాంజీ, ఇక ఎన్నడూ బాబాని వదిలి వెళ్ళరాదని
ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు. బాబా సమక్షంలో తన బాధలన్నీ మర్చిపోయినట్లు
భావించాడు. ఎన్నడూలేనంత ఆనందం ఆయనలో కలిగింది.
హృదయం ప్రేమతో నిండింది.
నేను చెప్పినట్లు నీవు చేయగలవా? అని బాబా ఛాంజీని అడిగారు.
**"తప్పకుండా బాబా"** అని జవాబిచ్చాడు.
అన్నీ వదిలి అహ్మద్‌నగర్‌లో వున్న తన ఆశ్రమంలో వచ్చి చేరమన్నారు బాబా.
నీకు నీ భార్య పట్ల వున్న ప్రేమకన్నా అత్యున్నతమైన ప్రేమను తన దగ్గర లభిస్తుందన్నారు.
బాబాను అనుసరించడానికి ఛాంజీ అంగీకరించాడు.
ముంబాయిలో అతడికున్న వ్యాపార లావాదేవీలన్నీ వదిలిపెట్టేయమన్నారు.
ఈ పనులన్నింటి కోసం తగిన సమయమిస్తానన్నారు.
కొన్ని నెలలపాటు ముంబాయి - మెహెరాబాద్‌లోని మెహెర్‌బాబా ఆశ్రమాల
నడుమ అటు ఇటూ పర్యటించాడు.
ఆ రోజుల్లోనే ఒకరోజున ఛాంజీకి భారీగా అప్పిచ్చిన స్నేహితుడు
బొంబాయిలో రోడ్లపై కనపడ్డాడు.
అతడ్ని చూస్తే అప్పు గురించి మాట్లాడవల్సి వస్తుందని ముఖం తప్పించి
మరో దిక్కుకు ఛాంజీ వెళ్ళబోయాడు.
కానీ, ఆ అప్పు ఇచ్చిన వ్యక్తి ఛాంజీని గుర్తుపట్టి,
ఛాంజీ దగ్గరకొచ్చి ప్రేమగా పలకరించాడు.
అప్పు తీర్చమని ఎక్కడ గలాభా చేస్తాడోనని బయపడిన ఛాంజీకి
ఆ వ్యక్తి ఆ డబ్బుల గురించే ప్రస్తావించలేదు.

నీవున్న పరిస్థితి నాకు తెలుసని ఓదార్పుగా మాట్లాడాడు.
నీవు ఇవ్వాల్సిన డబ్బు గురించి మర్చిపోదామన్నాడు.
నీ నిజాయితీ గురించి నాకు తెలుసు..
నీవు నాకు మంచి స్నేహితుడవన్నాడు.
నీ దగ్గర డబ్బు వుంటే అప్పు తీర్చేసేవాడివని నాకు తెలుసన్నాడు.
తన స్నేహితుడిలో వచ్చిన మార్పు అంతా,
బాబా తనకిచ్చిన బహుమతిగా ఛాంజీ భావించాడు.
దీంతో ఛాంజీలో బాబా పట్ల నమ్మకం, విధేయత మరింత అధికమయ్యాయి.
ఆ రకంగా 1924లో బాబా ఆశ్రమంలో చేరిన ఛాంజీ
ఆయన తల్లితండ్రులు, బంధుమిత్రులందరూ చాలామంది ఒక్కొకరుగా
బాబా పరిధిలోకి వచ్చారు. ఛాంజీ పార్శీయుడు. జొరాష్టరు వారి మత గురువు.
జొరాష్టరును తప్పించి అన్యుల్ని పూజించడం నిషిద్ధం.
ప్రవక్తలు, ఇతర మత పెద్దలను, గురువులను పార్శీయులు నమ్మరు గాన నమ్మరు.
ఛాంజీ బంధుమిత్రులు చాలామంది, ముందుగా మెహెర్‌బాబాను వ్యతిరేకించారు.
కానీ, కాలక్రమేణా మెహెర్‌బాబాలో తమ జొరాష్టరును దర్శించుకున్నారు.
ఛాంజీ గారి బంధువులు నౌరోజీ, ఆయన కుమార్తెలు ఆర్నవాజ్, నర్గీస్,
మెహెర్‌జీ కర్కారియా, నారీమన్ ఇలా ఎందరో ఆ పిదప బాబాను అనుసరించారు.
బాబావారి అన్ని పర్యటనలలో ఛాంజీ పాల్గొన్నాడు.
మెహెర్‌బాబా తొలి కార్యదర్శిగా సుమారు రెండు దశాబ్దాలు పైగా
ఛాంజీ పనిచేశాడు. బాబాతో కలిసి దేశ, విదేశాలలో పర్యటించాడు.
బాబావారిచ్చే సందేశాలను ఎప్పటికప్పుడు తన డైరీలలో ఛాంజీ రాసుకునేవాడు.
బాబా కార్యదర్శిగా వున్న ఛాంజీ ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేవాడు.
బాబా గురించిన కబుర్లు అనేకం చెప్తుండేవాడు.
బాబా ప్రేమికులకు, బాబాకు మధ్య ఒక వారధిగా ఛాంజీ వున్నాడు.
బాబా ఎడల ఆయన ప్రేమ, ఆయన సున్నిత మనస్తత్వం బాబా ప్రేమికుల్ని ఆకర్షించేది.

## విధేయతతో

మెహెర్‌బాబా ఎడల ఛాంజీ విధేయత ఎలా వుండేదో చెప్పేందుకు
అనేక ఉదాహరణలున్నాయి. **ఛాంజీతో బాబా సంభాషణ పరిశీలించండి!!**
బాబావారితో కలిసి ఛాంజీ ఒకసారి ఓడలో ప్రయాణం చేస్తున్నాడు.
ఉన్నట్లుండి ఓడ ఎందుకు అంత చిన్నగా నడుస్తోందో కెప్టెన్ దగ్గరకెళ్ళి
కనుక్కోమన్నారు బాబా. ఛాంజీ సరేనన్నాడు. కెప్టెన్ దగ్గరికి వెళ్ళి అడిగాడు.

కెప్టెన్ ఛాంజీ కేసి చూసి నవ్వుతూ, జవాబు ఏమీ ఇవ్వకుండా తెరిపార చూశాడు. ఆ మర్నాడు తిరిగి కెప్టెన్ దగ్గరకు వెళ్ళి, వాళ్ళు వెళ్తున్న దేశం ఎప్పుడొస్తుందో కనుక్కోమన్నారు బాబా. ఆ మర్నాడు ఎన్ని గంటలకు వారు వెళ్ళాల్సిన దేశం చేరుకుంటారో తిరిగి అడగమన్నారు. ఆ తర్వాత, ఓడను ఎందుకు అంత చిన్నగా నడుపుతున్నారో కెప్టెన్‌తో విచారించమన్నారు. కాస్తంత వేగం పెంచమని సలహా ఇవ్వమని మరలా కెప్టెన్ దగ్గరకు బాబా పంపారు. ఇలాంటి ప్రశ్నలతో ఓడ కెప్టెన్‌ని విసిగిస్తే, కేప్టెన్ తనని ఎలా చూస్తాడో తెలిసిన ఛాంజీ, కేవలం బాబా ఎడల గల విధేయతతో బాబా చెప్పినట్లు మాత్రం ఛాంజీ చేశాడు.

బాబా! ఏమిటీ ప్రశ్నలని ఏనాడూ అడగలేదాయన.

అలాగే, మరోసారి ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు,

వారు తింటున్న పదార్థాలలో కొద్దిగా ఉప్పు ఎక్కువైందనో, తక్కువైందనే నెపంతో వంటవాళ్ళ దగ్గరకి ఛాంజీని పంపారు. ఎందుకలా ఉప్పు తక్కువ వేశారో కనుక్కోమనేవారు. ఇదంతా అవతారుని ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఒక భాగం.

మరో సందర్భంలో ఓడలో ప్రయాణిస్తుండగా,

బాబావారు - ఛాంజీ ఇద్దరూ ఒకే క్యాబిన్‌లో వున్నారు.

బాబా చెప్తున్న లేఖను ఛాంజీ రాసుకుంటున్నాడు.

అయితే ఆ లేఖ రాస్తూ, బాబా చెప్పిన విషయాన్ని కొద్దిగా సవరించమని వినమ్రంగానే సూచించాడు. ఛాంజీ ఇచ్చిన సలహా బాబాకు నచ్చలేదు.

బాబాకు తీవ్రమైన కోపం వచ్చింది. ఛాంజీ చెంప ఛెళ్ళు మనిపించారు.

ఛాంజీ మనస్సు చివుక్కుమంది. ఆయన కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి.

అదే సమయంలో క్యాబిన్ డోర్ తెరుచుకుని బాబాతో ప్రయాణిస్తున్న ఒక పాశ్చాత్య బాబా ప్రేమికురాలు వారి కేబిన్‌లోకి వచ్చింది.

బాబా నవ్వుతూ అంతవరకూ ఏమీ జరగలేదన్నట్లు

ఛాంజీ తనమీద వున్న ప్రేమతో కంటతడబెట్టాడని చెప్పారు.

ఛాంజీ తనవెంట ఎప్పుడూ ఒక పోర్టబుల్ టైపు రైటర్ తీసుకెళ్ళేవాడు.

పగలంతా బాబా చెప్పిన సందేశాలను డైరీలో రాసుకుని

రాత్రిళ్ళు పొద్దుపోయేదాకా ఆ టైపు రైటర్ మీద టైపు చేసేవాడు.

ఏ రోజు పనిని ఆ రోజు పూర్తి చేసేవాడు.

రైలులో ప్రయాణం చేసేటప్పుడు కూడా బాబా చెప్పిన సందేశాలను పొద్దుపోయినా పూర్తిచేసి మరనాటికల్లా బాబా చెప్పిన విషయాలన్నీ చిత్తుప్రతి తయారుచేసి బాబా అనుమతి కోసం సిద్ధంగా వుంచేవాడు.

బాబా కార్యదర్శిగా వున్న రెండు దశాబ్దాల కాలంలో ఏ రోజు జరిగిన సంఘటన

ఆ రోజు తన డైరీలలో ఉన్నది ఉన్నట్లుగా రాసి పెట్టాడు. బాబా కార్యక్రమాలన్నింటినీ అతి చిన్న విషయాలను కూడా ఛాంజీ తన డైరీలలో పొందుపరిచాడు.

ఛాంజీ డైరీల ద్వారా నేటి మెహెర్‌బాబా పాఠకులకు అనేక ఆసక్తికర విషయాలు తెలుస్తున్నాయి.

## బాబాలో ఐక్యం

1944 ఆగస్టు 25న ఛాంజీ కాశ్మీర్‌లో మరణించాడు. అతని ఆకస్మిక మరణం బాబా ప్రేమికుల్ని చాలామందిని బాధకు గురి చేసింది. సాధారణంగా ఛాంజీ చాలా ఆరోగ్యంగా వుండేవాడు. ఎన్నడూ ఎలాంటి అనారోగ్యం ఆయనకు దరిచేరలేదు. కానీ, 1944 ఆగస్టులో కాశ్మీర్‌లో వుండగా ఆయన టైఫాయిడ్ జ్వరంకి గురయ్యాడు. ఆ జ్వరం నుండి తిరిగి ఆయన కోలుకోలేదు. ఛాంజీ తుదిశ్వాస వదిలిన సమయానికి ఆయన వయస్సు కేవలం 52 సంవత్సరాలు. ఈ విషయమై బాబా సన్నిహిత మండలి సభ్యుడొకరు బాబాని ఇలా అడిగాడు. ఛాంజీ నీకు చాలా ఇష్టమైన మండలివాడు కదా !! ఎంతో కాలంగా అతను నీతోపాటు వున్నాడు. నీ కార్యదర్శిగా ఛాంజీ సేవలు నిరుపమానమైనవి. అలాంటివాడి ప్రాణాలను ఐదు పదులకే తీసుకోవడం భావ్యమా? అని బాబాను నేరుగానే అడిగాడు. అందుకు బాబా సమాధానం కూడా ఆలకించండి!! నేనిప్పటికే రెండుసార్లు ఛాంజీని రక్షించానని బాబా చెప్పారు.

అతను 22 సంవత్సరాల వయస్సులో బొంబాయిలో చౌపాతి బీచ్‌లో ఆత్మహత్య చేసుకునేవాడిని, ఆ నిర్ణయం నుండి తప్పించి, రక్షించానని గుర్తుచేశారు. రెండవసారి మెహెరాబాద్‌కు దగ్గర్లో వున్న టోకా దగ్గర నదిలో మునిగిపోతున్నప్పుడు అతనికి చేయి అందించి తిరిగి ప్రాణం పోసింది నేనే కదా అని గుర్తు చేశారు. 1928 ప్రాంతంలో బాబా టోకా అనే ప్రాంతంలో తాత్కాలికంగా మెహెరాశ్రమం నిర్వహించారు. ఛాంజీ అక్కడున్న సమయంలో దగ్గర్లోని నది ఒడ్డున కూర్చుని కాలుజారి నీళ్ళలో పడిపోయాడు. ఛాంజీకి ఈత రాదు. దాదాపుగా మునిగిపోయాడు. అలా మునిగిపోతున్నప్పుడు ఛాంజీ తన ప్రాణం పోతోందని తెలిసి బిగ్గరగా గొంతెత్తి **బాబా బాబా** అని అరిచాడు. ఆ సమయంలో ఎవరో చెయి అందించగా నది గర్భంలోనించి ప్రాణాలతో బయటపడ్డాడు ఛాంజీ. ఆ చెయ్యి ఎవరిదో కాదు. సాక్షాత్తూ అవతారమూర్తిది. ఈ విషయమై ఛాంజీ చెప్తూ...

తాను నదిలో మునిగిపోతున్నట్లు, తనకిక మరణం తథ్యం అని తెలుసుకున్నాను. చిన్నగా నదిలోపలికి వెళ్ళిపోతున్నాను. అయితే కొన్ని క్షణాల్లోనే బాబా తన చేతిని అందించి రక్షించాడని ఛాంజీ చెప్పుకునేవాడు.

***

## అతనెప్పుడో మరణించాడు

ఇక్కడొక విషయం చెప్పాలి. ఛాంజీ తన భార్యతో విడాకులు తీసుకున్నాక,
ఆయన తల్లి ఎలాగైనా ఛాంజీకి మరో వివాహం చేయాలని తహతహలాడింది.
ఆ తల్లి మనస్సు ఎంతో తాపత్రయ పడింది. ఎన్నో సంబంధాలు తీసుకొచ్చింది.
కానీ, ఛాంజీ ఇక తన పెళ్ళి ఆలోచనే వద్దని తల్లితో గట్టిగానే చెప్పాడు.
ఛాంజీ బాబాకు అంకితమయ్యాడన్న సంగతి ఆ తల్లికి తెలియదు కదా!!
ఛాంజీ జాతకంలో మరో పెళ్ళి ఘడియంటూ ఉందో? లేదో? తెలుసుకునేందుకు
ఛాంజీ తల్లి అనేక జాతక బ్రహ్మల చుట్టూతా తిరిగింది.
అలాగే, ఒకసారి ఛాంజీ తల్లి ఒక గొప్ప సిద్ధాంతి దగ్గరకు వెళ్ళింది.
ఛాంజీ జాతకచక్రం చూపించింది. ఆ సిద్దాంతి ఆ జాతకాన్ని పైకి కిందకీ చూసి,
పెద్దగా అరుస్తూ, ఆ కాగితాన్ని తిరిగి ఆమెపై విసిరేశాడు.
ఏమిటి? ఈ చనిపోయినవాని జాతకం తీసుకొచ్చి చూడమంటారా? అని మండిపడ్డాడు.
. ఛాంజీ గారి తల్లి తక్కువ తిందా.. చచ్చి పోయాడా? ఎవరూ?? అని ఎదురు
ప్రశ్నించింది. ఈ జాతకం ఎవరిదో తెలుసా? అని సిద్దాంతిని రెట్టించింది.
ఈ జాతకం ...నా సొంత కొడుకుది. వాడు నిక్షేపంగా బ్రతికున్నాడు.
సలక్షణంగా వున్న నా కొడుకుని చచ్చిపోయాడంటావా? అని తిరిగి సిద్ధాంతిపై
ఆమె విరుచుకుపడింది.
అయితే ఆ పిల్లవాడికి జీవం లేదు, చచ్చిపోయిన జీవచ్ఛవం.
అలాంటివాడి జాతకాన్ని నన్నేం చదవమంటావ్. ఈ జాతకుడు ప్రాణంతో లేదు.
ఎప్పుడో చచ్చిపోయాడు. నేను సాధికారికంగా చెప్పుతున్నాను.
ఈ జాతకుడు చచ్చిపోయాడు. ఈ జాతకంలో జీవం లేదని సిద్ధాంతి స్పష్టం చేశాడు.
సిద్ధాంతి తప్పు చెబుతున్నాడని, అతనో తెలివితక్కువ మూర్ఖునికింద జమకట్టి
ఛాంజీ గారి తల్లి వెనుతిరిగింది.
ఆ తర్వాత ఛాంజీ టోకా నదిలో మునిగిపోవడం,
అంతక్రితం చౌపతీ బీచ్ సంఘటనలు తెలుసుకున్న ఆ మాతృహృదయం,
ఆ దరిమిలా కుదుటపడింది.

***

ఛాంజీ మరణంపట్ల బాబా ఇలా అన్నారు.
ఛాంజీ నాకు శిష్యుడే కాదు. గొప్ప స్నేహితుడని ప్రశంసించారు.
నిస్వార్ధంగా, విధేయతతో రెండు దశాబ్దాలు బాబా సేవ చేసుకున్న ఫ్రమ్‌రోజ్ హెచ్
దాదా ఛాంజీ ధన్యుడు. ఈ తరం వారికి ప్రాతఃస్మరణీయుడు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2015 మే-జూన్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మే | సి. సాంబశివరావు, సంగారెడ్డి, మెదక్ జిల్లా | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 500.00** |

మే నెలలో శ్రీ డి.టి.వి.ఎస్.ఆర్. కృష్ణప్రసాద్, చల్లపల్లి రూ.1000/- చెల్లించారు. కానీ,ఆ నెలలో వారి చిరునామా వివరాలు అందనందున ప్రచురించలేకపోయాం. దయచేసి గమనించగలరు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973. IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం.32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month